RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com




# వుదయం




గుంటూరు | 12-06-2026 శుక్రవారం | సంపుటి : 13 | సంచిక : 93 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

# విద్య, వైద్యమే దేశానికి బలమైన పునాది

**కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనా వివరించిన సీఎం**
**ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడి**



**న్యూఢిల్లీ, జూన్ 11 (ఎఎంఎస్) :**

దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాదని నీతి ఆయోగ్ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను నీతి ఆయోగ్ లో ఆయన వివరించారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని చెప్పారు.



గురువారం రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధేనని గుర్తు చేశారు. ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని సీఎం చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (SEEEPC)లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో పైసలు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.

**తెలంగాణలో విద్యా-నైపుణ్యాభివృద్ధి విప్లవం**

విద్యాశాఖను తన వద్దే ఉంచుకోవడానికి కారణం విద్యపై తనకు ఉన్న నమ్మకమేనని సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. గడచిన 75 ఏండ్లలో మనమంతా ఉచిత విద్య అందించేందుకు ప్రయత్నం చేశామని, కానీ నాణ్యమైన విద్యను అందించడం మనకు ఒక సవాలుగా మారిందన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు.

తమ ప్రభుత్వం నిర్మించే యంగ్ ఇండియా స్కూల్స్ కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

కాగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా... అధికారులైనా తమ రాష్ట్రంలోని యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే తాము సంతోషంగా చూపిస్తామని చెప్పారు.

కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు ఈ యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని వివరించారు.

# ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం

**హైదరాబాద్,జూన్ 11 (వుదయం) :**



రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రిగారు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవిన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్& రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిధిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. మొదటి దశలో అద్దె భావనాలల్లో, శిథిలావస్థాలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు.

# అత్యంత తీవ్రమైన దాడులు

**వాషింగ్టన్:**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టించే హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌పై అమెరికా సేనలు ఈ రాత్రికి భీకర దాడులు చేయబోతున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తన అధికారిక సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' వేదికగా ఒక పోస్ట్ చేస్తూ.. ఇరాన్ రక్షణ రంగాన్ని నాశనం చేయడమే లక్ష్యంగా ఈ రోజు రాత్రి అత్యంత తీవ్రమైన దాడులు ఉంటాయని ప్రకటించారు. రక్షణ వ్యవస్థలన్నీ క్లోజ్.. తదుపరి లక్ష్యం చమురు నిల్వలే!



ఇరాన్‌కు చెందిన కీలక సైనిక స్థావరాలు ఇప్పటికే అమెరికా దాడుల్లో కుప్పకూలాయని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. "ఇరాన్ నౌకాదళం, వాయుసేన, రాడార్ వ్యవస్థలు, క్షిపణి నిరోధక శ్రేణులతో పాటు ఆ దేశ రక్షణ రంగానికి చెందిన అన్ని కీలక వ్యవస్థలు ఇప్పటికే పూర్తిగా నాశనమయ్యాయి" అని ట్రంప్ ప్రకటించారు. అంతటితో ఆగకుండా, తదుపరి వ్యూహాన్ని కూడా ఆయన బహిర్గతం చేశారు. సమీప భవిష్యత్తులో ఇరాన్‌కు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన 'ఖర్గ్ ద్వీపాన్ని' మరియు అక్కడి చమురు మౌలిక సదుపాయాలను అమెరికా తన ఆధీనంలోకి తీసుకోబోతోందని హెచ్చరించారు. తద్వారా ఆయా అంతర్జాతీయ చమురు మార్కెట్లపై అమెరికా పూర్తి నియంత్రణ సాధిస్తుందని స్పష్టం చేశారు.

'వెనిజులా' తరహా వ్యూహమే ఇక్కడ కూడా.. గతంలో వెనిజులా విషయంలో అమెరికా అవలంబించిన కఠినమైన ఆర్థిక, రాజకీయ మరియు సైనిక వ్యూహాలనే ఇప్పుడు ఇరాన్ పైనా ప్రయోగించబోతున్నట్లు ట్రంప్ పరోక్షంగా సూచించారు.

# 'ఇండియా' కూటమి బలోపేతం

**దిల్లీ:**

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కాబోతోందంటూ వస్తున్న కథనాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండించింది. అవన్నీ కేవలం పుకార్లేనని, వాటిలో ఎలాంటి నిజం లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. దిల్లీలో జరిగిన పార్టీ అగ్రనేతల కీలక సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాజా భేటీలో కేవలం 'ఇండియా' కూటమిని మరింత బలోపేతం చేయడంపైనే చర్చలు సాగాయని వివరించారు.

**'ఓటు చోరీసీటు చోరీ' డబుల్ ఇంజిన్ సర్కార్: జైరాం రమేశ్ ధ్వజం**

ఇతర పార్టీలకు చెందిన ఎంపీలతో రాజీనామాలు చేయించి, బలవంతంగా భాజపాలో చేర్చుకోవడం 'సీట్ల చోరీ' కిందకే వస్తుందని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి నామినేషన్‌ను కావాలనే తిరస్కరించి, భాజపా మద్దతు ఉన్న అభ్యర్థి నామినేషన్‌ను అంగీకరించడం దేశంలో ప్రజాస్వామ్య దుస్థితికి అద్దం పడుతోందని మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ తీవ్రంగా స్పందిస్తూ...

"దేశంలో ప్రజాస్వామ్యానికి 'ఓటు చోరీ', 'సీటు చోరీ' అనే మోదీ ప్రభుత్వ డబుల్ ఇంజిన్ విధానం అత్యంత ప్రమాదకరంగా మారింది" అని వ్యాఖ్యానించారు.

**మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై దేశవ్యాప్త పోరాటం**

దేశ ఆర్థిక దుస్థితి, అదుపు తప్పిన ధరల పెరుగుదల, దేశాన్ని కుదిపేస్తున్న పరీక్షల సంక్షోభం (పేపర్ లీకేజీలు) వంటి అన్ని సమస్యలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే బాధ్యత వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ వైఫల్యాలపై జూన్ నెలాఖరు నుంచి దేశవ్యాప్తంగా మరియు రాష్ట్రాల స్థాయిలో 23 నెలల పాటు సుదీర్ఘ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.

అంతకుముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జిలు, రాష్ట్రాల అధ్యక్షులతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు.



ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కేవలం అధికార పక్షంపై రాజకీయ పోరాటమే కాకుండా.. దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాన్ని కాపాడటం కాంగ్రెస్ ప్రాథమిక బాధ్యతని అగ్రనేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**సుప్రీంకోర్టుకు చేరిన రాజ్యసభ నామినేషన్ రద్దు వివాదం**

మధ్యప్రదేశ్‌లో తన రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత మీనాక్షీ నటరాజన్ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, ఎన్నికల ప్రక్రియ మధ్యలో ఉండగా ఈ పిటిషన్‌ను ఎలా విచారించాలంటూ సర్వోన్నత న్యాయస్థానం ప్రాథమికంగా ప్రశ్నించింది.









# అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి



**-జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**కల్వకుర్తి జూన్ 11 (వుదయం ప్రతినిధి)**

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన సంక్షేమ సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.గురువారం కల్వకుర్తి పట్టణ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, క్యాటిల్ మార్కెట్‌ను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు.షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల కేటాయింపు, మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, స్థానిక యువతకు, చిన్న వ్యాపారులకు ఉపాధి లభించేలా ఖాళీ షాపులను అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీర్లకు సూచించారు. అవసరమైతే నిర్మాణ సామగ్రి, సిబ్బందిని పెంచి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్యాటిల్ మార్కెట్‌లో పశువుల కొనుగోలు, విక్రయాలకు వచ్చే రైతులు, వ్యాపారులకు ఇబ్బంది లేకుండా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు."అభివృద్ధి పనులు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకురావాలంటే నాణ్యత, పారదర్శకత, సమయపాలన కీలకం. ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి పనిని బాధ్యతాయుతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి" అని కలెక్టర్ పేర్కొన్నారు.తనిఖీలో మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నమాల, కమిషనర్ అహ్మద్, కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో భారతదేశం మూడో స్థానంలో ఉంది



**- మోదీ పాలన 12 సంవత్సరాలు పూర్తి**

**.మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ**

**సంగారెడ్డి వుదయం.**

గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా ప్రధాని మోదీ నాయకత్వంలో పేదల సంక్షేమం, దేశ భద్రత, డిజిటల్ విప్లవం, ఆర్థిక సంస్కరణలు వంటి పలు రంగాల్లో దేశం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే "వికసిత్ భారత్-2047" లక్ష్య సాధన దిశగా ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ముందుకు సాగుతోందని వారు అన్నారు. ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను మరింత పెంచడంలో మోదీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు .ఈ సమావేశంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ , మాజీ ఎంపీ బి .బి . పాటిల్ , మాజీ ఎమ్మెల్యే విజపాల్ రెడ్డి , బీజేపీ జిల్లా మీడియా ఇంచార్జి విఠల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, జగన్, జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర్ రావు దేశ్‌పాండే, సీనియర్ నాయకుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రెవెన్యూ అధికారిని సన్మానించిన టీఎన్జీవో నాయకులు



**నాగర్ కర్నూల్ జూన్ 11**

**(వుదయం బ్యూరో)**

ఇటీవల బదిలీపై వచ్చిన జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ టీఎన్జీవో నాయకులు గురువారం ఆయన చాంబర్‌లో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆయనకు పరిచయం చేసుకోవడంతో పాటు జిల్లా ప్రజలకు సేవ చేయడానికి స్వాగతం పలికారు .ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్, కోశాధికారి బాలరాజు, ఉపాధ్యక్షులు కోట్ర బాలాజీ, చెన్నకేశవులు, యూనిట్ అధ్యక్షులు నసీరుద్దీన్, కార్యదర్శి మలిపెద్ది సురేష్ కుమార్, జిల్లా నాయకులు కళ్యాణ్ కృష్ణారావు, లింగం, రమేష్, ఎం. ఆనంద్, బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర విజయవంతం



**- తిమ్మాజిపేట, తాడూరులో ఘన స్వాగతం**

**నాగర్ కర్నూల్ జూన్ 11**

**(వుదయం బ్యూరో)**

పార్లమెంట్ పరిధిలో ఎంపీ మల్లి రవి చేపట్టిన ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు విజయవంతంగా కొనసాగింది.గురువారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో ప్రారంభమైన యాత్రకు వందలాది కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, మండల ప్రజలు తరలివచ్చి ప్రచార రథానికి బ్రహ్మరథం పట్టారు. రెండో రోజు యాత్ర తాడూరు మండల కేంద్రంలో ఘనంగా సాగింది. తాడూరు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై బస్సు యాత్రకు అపూర్వ ఆదరణ తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడమే ఈ బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశమని నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, "నేను రాజకీయాల్లోకి వచ్చింది పదవుల కోసం కాదు, ప్రజా శ్రేయస్సు కోసం. నియోజకవర్గ ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించారు. దానికి నేను సర్వదా రుణపడి ఉంటాను. నియోజకవర్గ అభివృద్ధిలో ముందుంటాను" అని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, భూమిలేని నిరుపేదలకు రైతు ఆత్మీయ భరోసా, సన్నవడ్లకు బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత సన్న బియ్యం, నాగర్‌కర్నూల్ జిల్లాలో 550 పడకల ఆసుపత్రి ఏర్పాటు వంటి పథకాలను చేపట్టి అండగా నిలుస్తుందని వివరించారు.

ప్రజల సంక్షేమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రెండు మండలాల ప్రజలు బస్సు యాత్రకు అందించిన ఆదరణ కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, సర్పంచ్ మల్లయ్య, మండల అధ్యక్షులు యార రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సభ్య సమాజం తలదించుకునే హేయమైన చర్య: నిందితుడిని కఠినంగా శిక్షించాలి

**- ఖమ్మం అపార్ట్‌మెంట్‌లో ఘోరం.. 12 ఏళ్ల చిన్నారిపై అత్యాచారం, పైనుంచి కిందకు నెట్టేసిన దుర్మార్గుడు**

**రజక సంఘం సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షుడు రాంగారి శ్రీధర్ తీవ్ర ఆగ్రహం**

**గజ్వేల్, గురువారం 11**

**( వుదయం ప్రతినిధి)**



ఖమ్మం నగరంలో సభ్య సమాజం తలదించుకునేలా అత్యంత హేయమైన, ఘోరమైన సంఘటన చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా తల్లంపాడు గ్రామానికి చెందిన (రజక కులస్థుల) దంపతుల 12 ఏళ్ల చిన్నారి వేసవి సెలవుల కోసం ఖమ్మం రాపర్తి నగర్‌లోని 'G Pride' అపార్ట్‌మెంట్‌లో పని చేసే తన తాత, అమ్మమ్మల వద్దకు వచ్చింది. అయితే, అదే అపార్ట్‌మెంట్‌లోని రెండో అంతస్తులో నివాసముంటున్న గౌస్ పాషా (42) అనే వ్యక్తి.. ఆ అమాయక చిన్నారిపై కన్నేశాడు. బాలికను బలవంతంగా అపార్ట్‌మెంట్ పైకి తీసుకువెళ్లి, రెండు చేతులు కట్టివేసి అత్యంత క్రూరంగా అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ దారుణం బయటపడుతుందనే భయంతో, తన తప్పును దాచిపెట్టేందుకు సదరు నిందితుడు ఆ చిన్నారిని చంపే ఉద్దేశంతో అపార్ట్‌మెంట్ పైనుంచి కిందకు తోసేశాడు. పైనుంచి పడటంతో ఆ బాలిక శరీరంలోని అంతర్గత అవయవాలన్నీ పూర్తిగా విరిగిపోయాయి. ప్రస్తుతం ఆ చిన్నారి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ, అత్యంత విషమ పరిస్థితిలో చికిత్స పొందుతోంది. ఈ అమానుష ఘటనపై రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాంగారి శ్రీధర్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి హేయమైన చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం, పోలీసులు తక్షణమే స్పందించి కఠినమైన నిర్ణయాలు, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడు గౌస్ పాషాను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఉరితీయాలని ఆయన కోరారు. ఈ ఖండన కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ క్యాషియర్ మెతుకు నరసింహులు, రాంగారి శివరాజయ్య, ఎనగారి రాములు, మల్లేశం, శంభుగారి కనకయ్య మరియు దుర్గయ్య తదితరులు పాల్గొని బాధితులకు అండగా ఉంటామని, న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.

# ఘనంగా ముగిసిన చత్రపతి శివాజీ సమ్మర్ క్యాంప్

**నారాయణపేట టౌన్ జూన్11**

**(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట పట్టణంలో నిర్వహించిన చత్రపతి శివాజీ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు కుంగ్‌ఫూ, యోగా, బాక్సింగ్ వంటి ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ ఇచ్చి, ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సలహా న్యాయవాది రఘువీర్ యాదవ్, బాలరాజ్ (సి టీం), గ్రాండ్ మాస్టర్ కనకం యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు ఆత్మరక్షణ విద్యలను పట్టుదలతో నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు. ఏదైనా దాడి జరిగినప్పుడు ప్రతిఘటించే శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే, విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ, చదువులో కూడా చురుకుగా రాణించాలని ప్రోత్సహించారు. ప్రదర్శనలు మరియు బహుమతుల ప్రదానం: ఈ కార్యక్రమంలో విద్యార్థులు తాము నేర్చుకున్న కటాస్ యోగా, స్టిక్ ఫైట్, బాక్సింగ్, మరియు రెజ్లింగ్ ప్రదర్శనలను అద్భుతంగా ప్రదర్శించి అందరినీ అలరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 10 మంది విద్యార్థులకు 'యెల్లో బెల్టు'లు, 8 మంది విద్యార్థులకు 'ఆరెంజ్ బెల్టు'లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు నానక్ రామ్, కోన సాయి కృష్ణ, రఘు, శివ, విజయ్, రాజేశ్వరి, స్వాతి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అత్యాచార యత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

**- సిద్దిపేట కోర్టు సంచలన తీర్పు.. పోలీసులను అభినందించిన సీపీ రష్మి పెరుమాళ్**

**సిద్దిపేట, జూన్ 11 (వుదయం బ్యూరో)**

వివాహితపై అత్యాచార యత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి కఠిన కారాగార జైలు శిక్ష మరియు జరిమానా విధిస్తూ సిద్దిపేట ఒకటవ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీ వై. జయప్రసాద్ గురువారం తుది తీర్పు వెల్లడించారు.చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన బాధితురాలి ఇంట్లోకి 2020 అక్టోబర్ 9న అదే గ్రామానికి చెందిన మెదుథుల బాలరాజు (40) అక్రమంగా చొరబడి, ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి చిన్నకోడూరు ఎస్.ఐ ఎస్. సాయి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పూర్తి స్థాయి విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు బాలరాజుకు కింది విధంగా శిక్షలు ఖరారు చేశారు. ఐపిసి సెక్షన్ 354(A)(i)(ii) కింద: 1 సంవత్సరం కఠిన కారాగార శిక్ష మరియు ₹5,000/ జరిమానా.

ఐపిసి సెక్షన్ 451 కింద: 6 నెలల కఠిన కారాగార శిక్ష మరియు ₹2,000/ జరిమానా.పోలీస్ బృందానికి సీపీ అభినందనలు:

ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ ఎస్. ఆమోరాములు సమర్థవంతంగా వాదనలు వినిపించి సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. నిందితుడికి శిక్ష పడేలా నిరంతరం కృషి చేసిన అప్పటి ఎస్.ఐ సాయికుమార్, ప్రస్తుత చిన్నకోడూరు ఎస్ఐ డి. చంద్రమోహన్, సి.ఐ.పి సిహెచ్. విద్యాసాగర్, కోర్టు కానిస్టేబుల్ ఎస్. రవి మరియు కోర్టు లైజనింగ్ ఆఫీసర్ డి. శ్రీనివాస్ రెడ్డిలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ప్రత్యేకంగా అభినందించారు.

# అందుబాటులో ఉండాలి.. వైద్యం అందించాలి



**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సిరిసిల్ల సుందరయ్య నగర్ అర్బన్ పీహెచ్ సీ ఆకస్మిక తనిఖీ**

**రాజన్న సిరిసిల్ల, జూన్ - 11**

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల సుందరయ్య నగర్ లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్ సీ)లో జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఓపీ, వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. ఏ ఎన్ సీ నమోదు, ఎన్ సీడీ స్క్రీనింగ్ టెస్టులపై ఆరా తీశారు. వ్యాక్సిన్ గది, మందులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రభుత్వ వైద్యశాలల్లోనే ప్రసవాలు, చికిత్స పొందేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని పేర్కొన్నారు. సబ్ సెంటర్ లలో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎన్ సీడీ స్క్రీనింగ్ టెస్టులు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# సర్పంచ్ అధికారం అడ్డుపెట్టుకొని అక్రమ భూమి రిజిస్ట్రేషన్

**- అడిగినందుకు దాడి**

**- బాధితురాలు సుశీల శ్రీశైలం**

**ఆందోల్ జోగిపేట్ వుదయం**

గురువారం మండల పరిధిలోని నేడిగుంట గ్రామంలో బాధితురాలు సుశీల మాట్లాడుతూ మా బావ అయినా ఒగ్గు సంగమేశ్వర్ అక్రమంగా సర్వే నెంబర్72రు మరియు117ఆ4 భూమి మొత్తం భూమి 18 గుంటల 50 సెంట్లు అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న బావ అయిన ఒగ్గు సంగమేశ్వర్ కు అడిగితే నాపై బూతు పురాణాలు చుట్టూ నాపై దాడి చేయడానికి వస్తే నేను డ్రైవర్ నువ్వు వీడియోలు ఫోటోలు తీయకు అని కాలర్ పట్టుకుని అడిగిన కానీ నా యొక్క భర్త ఒగ్గు శ్రీశైలం సుశీల పై దాడి చేయడమే కాకుండా గత వారం రోజుల నుండి సర్పంచ్ అయినా ఒగ్గు సాయికిరణ్ అడిగిన వరుసకు కొడుకు అని అడిగితే చిన్నమ్మ ఈ పోదు చేపిస్తా రేపు చేపిస్తా అంటూ నాకు మభ్యపెట్టుకుంటూ వచ్చినాడు బుధవారం అయినా తాసిల్దార్ కార్యాలయంలో చెక్కుల పంపిణీ అడగడానికి పోతే డ్రైవర్తో నాపై దాడికి దిగారని బాధితురాలు సుశీల మొర పెట్టుకున్నారు నాకు న్యాయం చేయాలని నేను పోలీస్ స్టేషన్ పోతే నువ్వే దాడి చేసినా అంటూ పోలీసులు నాపై దాడి కేసు నా భర్త పై నాపై పెట్టారని బాధితురాలు పెట్టుకున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలని మొర పెట్టుకున్నారు

# ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ కోర్సుల ప్రవేశాల గడువు పెంపు

**- జూన్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ప్రిన్సిపాల్/ కన్వీనర్ ఎస్. రామానుజం**

**సిద్దిపేట, జూన్ 11**

**(వుదయం బ్యూరో)**

సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ ఐటీఐ మరియు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ అలాగే ప్రైవేట్ ఐటీఐలలో 202627 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడత అడ్మిషన్ల గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మరియు కన్వీనర్ శ్రీ ఎస్. రామానుజం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30 (30.06.2026) వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు www.iti.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు తమకు వీలైనన్ని ఎక్కువ ఐటీఐ / ఏటీసీ లలో, ఎక్కువ ట్రేడ్‌లను ఆప్షన్లుగా ఇచ్చుకోవాలని ఆయన సూచించారు.సిద్దిపేట ప్రభుత్వ ఐటీఐ మరియు ఏటీసీ లలో కింది కోర్సులకు మొదటి విడత అడ్మిషన్ల గడువు పొడిగించబడింది: * ఎలక్ట్రీషియన్ * ఫిట్టర్ * మెకానిక్ డీజిల్ * మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ * ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ * ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ * సి.ఎన్.సి. మెషినింగ్ టెక్నీషియన్ * వర్చువల్ అనాలసిస్ అండ్ డిజైన్ * ఎలక్ట్రిక్ మెకానిక్ వెహికల్

దరఖాస్తుకు కావలసిన ధృవపత్రాలు:రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో అభ్యర్థులు కింది పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది: 1. పదో తరగతి మార్కుల మెమో 2. బోనఫైడ్ సర్టిఫికెట్లు (1st to 10th) 3. కుల ధృవీకరణ పత్రం 4. ఈమెయిల్ ఐడి, మొబైల్ నంబర్ మరియు ఆధార్ కార్డ్. ఈ ప్రవేశాలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా లేదా ఇతర పూర్తి వివరాల కోసం 99519 68689, 83098 65463 మొబైల్ నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

# అనుమతి ఉన్న అడ్డుకుంటాం

**-ఎమ్మెల్యే హామీని బి కదార్ చేయరా**

**-జైల్ కన్నా వెళ్తాం ఇసుక తీయనియ్యం**

**-తహసీల్దార్, కాంట్రాక్టర్ తో వాగ్వివాదం పెట్టుకున్న గ్రామస్తులు**

**-చేసేది లేక వెనుతిరిగిన అధికారులు, ఇసుక వాహనాలు**

**తాండూరు వుదయం ప్రతినిధి**

ఇసుక తరలించేందుకు ఏవిధమైన అనుమతులు ఉన్నప్పటికీ మేము అడ్డుకొని తీరుతామని తాండూరు మండలం చంద్రవంచ గ్రామానికి చెందిన ప్రజలు వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. వాహనాల వద్దకు చేరుకున్న సంబదిత కాంట్రాక్టర్ అక్కడికి చేరుకున్నప్పటికీ ఇసుక తరలించేందుకు వెళ్ళనీయమని తెగిసి చెప్పారు. దీంతో తాహసిల్దార్ తారా సింగ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఘటన స్థలానికి చేరుకున్న తాహసిల్దార్ తార సింగ్ కు కూడా గ్రామ ప్రజలు అదే రీతిలో సమాధానం చెప్పారు. కోటపల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం కలెక్టర్ ద్వారా ఇసుక అనుమతులు ఉన్నాయని చెప్పే ప్రయత్నం చేసిన ఆ గ్రామ ప్రజలు వినిపించుకోలేదు. గత వారం రోజుల క్రితం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చెప్పిన మాటలు నిజం కాదా అంటూ ప్రశ్నించారు. స్వయంగా ఎమ్మెల్యే ఆదేశాలను కూడా బే ఖాథార్ చేస్తూ ఇసుక అనుమతులు ఏంటి అంటూ ప్రశ్నించారు. గ్రామ ప్రజలను కాదని ఊర్లో నుండి ఒక్క వాహనాన్ని కూడా వెళ్ళనివ్వమని రోడ్డుకు అడ్డంగా నిలబడి వాహనాలను వెనక్కి పంపించారు. ఇప్పటికే కోటపల్లి చెక్ డాం నిర్మాణం పేరుతో నదిలోనుంచి ఇసుక రేణువులు లేకుండా పూర్తిగా తుడుచుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఏముందని యేసుక తరలించేందుకు వస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మా గ్రామంలో ప్రభుత్వం ద్వారా వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కి కూడా ఇసుక లేని పరిస్థితి వచ్చిందని చెప్పారు. సొంత ఇండ్లు నిర్మించుకోవడానికి ఇసుక తీసుకురావడానికి వెళ్లిన పోలీసులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తుపరిచారు. మా గ్రామంలో ఉన్న వనరులను మేము కాకుండా ఇంకెవరికి దక్కనివ్వమని తెగేసి చెప్పారు. సెదిలేక ఇసుక తరలించే వాహనాలను వెనక్కి తీసుకెళ్లారు నిర్వాహకులు. దీంతో స్థానిక ఉప సర్పంచ్ అక్రమ్, పలువురు వార్డు సభ్యులు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# నిరుద్యోగ క్రైస్తవ యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణకు కార్యక్రమాలకు ప్రతిపాదనల ఆహ్వానం

**- శిక్షణ సంస్థలు తమ ప్రతిపాదనలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలి**

**పెద్దపల్లి, జూన్ -11 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ ప్రభుత్వ మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ క్రైస్తవ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2026 27 ఆర్థిక సంవత్సరానికి గాను నిరుద్యోగ క్రైస్తవ యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు

. ఈ నేపథ్యంలో, టాస్క్ ఈజీఎమ్ఎమ్, మెప్మా, ఎన్ఎస్డీసీ, ఎన్ఐఎమ్ఎస్ఎమ్ఈ, ఇతర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలతో అనుబంధం కలిగి, ఉపాధి కల్పనలో అనుభవం ఉన్న శిక్షణ భాగస్వామ్య సంస్థలు తమ ప్రతిపాదనలను సమర్పించవలసిందిగా కోరడమైనది.శిక్షణ భాగస్వామ్య సంస్థలు జనరల్ డ్యూటీ అసిస్టెంట్, డ్రోన్ ఆపరేటర్, సైబర్ సెక్యూరిటీ, రూఫ్ టాప్ సోలార్ గ్రిడ్ జూనియర్ ఇంజనీర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్ సర్వీసెస్, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్, జనరేటివ్ / మెషిన్ లెర్నింగ్, మెడికల్ రిప్రజెంటేటివ్, పేమెంట్ రిలేషన్స్ అసోసియేట్, వీడియో ఎడిటింగ్ విత్ AI టూల్స్, సైబర్ సెక్యూరిటీ అసోసియేట్, సోలార్ ఎల్ఈడి టెక్నీషియన్, అడ్వాన్స్డ్ బ్యూటీ థెరపీ, హౌస్ కీపింగ్, డేటా సైన్స్ ,అనలిటిక్స్, డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, గ్రాఫిక్ డిజైన్ విత్ ఏఐ టూల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసోసియేట్, ఎలక్ట్రిక్ వెహికల్ అసెంబ్లీ టెక్నీషియన్, ప్లంబర్ జనరల్, సోలార్ ప్యానెల్ ఇన్‌స్టలేషన్, హెల్త్ కేర్ అసిస్టెంట్ వంటి పలు కోర్సులలో శిక్షణ అందించడానికి దరఖాస్తు చేసుకోవచ్చు అని, ఆసక్తి గల శిక్షణ భాగస్వామ్య సంస్థలు తమ సంస్థ వివరాలు, ప్రభుత్వ/నైపుణ్యాభివృద్ధి సంస్థల అనుబంధ ధృవపత్రాలు, శిక్షకుల అర్హతలు, మౌలిక సదుపాయాల వివరాలు, గతంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల సమాచారం, ప్లేస్‌మెంట్ రి



కార్డులను జతచేసి తమ ప్రతిపాదనలను జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి కార్యాలయం, పెద్దపల్లి వారికి సమర్పించాలని, అందిన ప్రతిపాదనలను పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన అనంతరం అర్హత కలిగిన సంస్థలకు తెలంగాణ క్రైస్తవ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పని ఆదేశాలు జారీ చేయబడతాయని, పూర్తి వివరాల కోసం కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని మైనారిటీ సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఇజ్రాయెల్ దేశంలో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్

**-పెద్దపల్లి, జూన్ - 11**

**(వుదయం ప్రతినిధి)**



తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ దేశంలో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇజ్రాయెల్‌లో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాలకు డిమాండ్ ఉందని, మొత్తం 3500 ఖాళీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇందులో 90 శాతం మహిళలకు, 10 శాతం పురుషులకు కేటాయించినట్లు తెలిపారు. ANM / GNM / MPHW / డిప్లొమా ఇన్ పేషెంట్ కేర్ / B.Sc నర్సింగ్ విద్యార్హత కలిగి, 25 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వం నుండి గుర్తింపు పొందిన భారతీయ అధికార సంస్థ ద్వారా గుర్తింపు పొందిన నర్సింగ్ డిప్లొమా నుంచి శిక్షణ పొంది ఉండాలని, కనీసం 2 సంవత్సరాల నర్సింగ్ అనుభవం, ఇంగ్లీష్ భాషా ప్రాథమిక పరిజ్ఞానం తప్పనిసరి అని, ఎంపికైన వారికి నెలకు సుమారు 5880.02 NIS,2000 యు ఎస్ డి,193,000 వేతనం రెండు సంవత్సరాల ఒప్పందం కాలంతో ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు మరింత సమాచారం కోసం 9440052081, 9440051763, 9440052592, 9440049645 నంబర్లలో సంప్రదించాలని,tomcomglobal@gmail.com మెయిల్ ఐడికి పంపవలసిందిగా జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆ ప్రకటనలు పేర్కొన్నారు.

# డిసిహెచ్ఎస్ కార్యాలయం, పెద్దపల్లి



**పెద్దపల్లి జూన్ 11 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి గ్రామానికి చెందిన 27 సంవత్సరాల గర్భిణీ స్త్రీ గత కొంతకాలంగా పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో యాంటినేటల్ చెకప్‌లు (Antenatal Checkups) చేయించుకుంటున్నారు. సాధారణ అల్ట్రాసౌండ్ స్కాన్ నిర్వహించగా ఆమెకు పూర్తి ప్లాసెంటా ప్రీవియా (Complete Placenta Praevia) ఉండటంతో పాటు ప్లాసెంటా ఇంటర్నల్ ఓస్‌ను పూర్తిగా కప్పి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అనంతరం ఎంఆర్ఐ (MRI) పరీక్ష కూడా చేపించగా అదే నిర్ధారణ అయింది.ఈ పరిస్థితి అత్యంత ప్రమాదకరమైన గర్భధారణ సమస్యగా పరిగణించబడుతుంది. ప్రసవ సమయంలో తీవ్రమైన రక్తస్రావం సంభవించే అవకాశం ఉండటంతో సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ గారి సూచనల మేరకు వైద్య బృందం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. శస్త్రచికిత్స కోసం నాలుగు యూనిట్ల రక్తాన్ని రిజర్వ్ చేసి, అత్యంత జాగ్రత్తగా సిజేరియన్ శస్త్రచికిత్సను నిర్వహించారు.శస్త్రచికిత్స సమయంలో రక్తస్రావాన్ని సమర్థవంతంగా నియంత్రించి, తల్లి మరియు శిశువును క్షేమంగా ఉంచడంలో వైద్య బృందం విజయవంతమైంది. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు.తల్లి, బిడ్డ క్షేమంగా ఉండటంతో వారి కుటుంబ సభ్యులు మరియు బంధువులు ఆనందం వ్యక్తం చేస్తూ సూపరింటెండెంట్ గారికి మరియు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి సర్జరీలో గైనకాలజిస్ట్ వైద్యులు డాక్టర్ మంజుల మరియు డాక్టర్ శ్రీదేవి అనేస్తేషియా వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్ మరియు డాక్టర్ కృష్ణవేణి గారు పాల్గొన్నారు. ఈ సర్జరీ చేసిన వైద్య బృందంను, OT సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ గారు ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి: పి. డేవిడ్ రాజ్

**నల్లగొండ, జూన్ 11:**

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించనున్న అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఏఐసీఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ పి. డేవిడ్ రాజ్ పిలుపునిచ్చారు.గురువారం పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలో ఉన్న సెల్ఫ్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలోని లక్ష్మీ గార్డెన్స్‌లో జరగనున్న ఈ అవగాహన సదస్సుకు ఎమ్మార్పీఎస్ జాతీయ ఈ వివక్షను వెంటనే తొలగించి, ఇతర దళితులతో సమానంగా వారికి కూడా రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే దళిత సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 13న నిర్వహించే సదస్సుకు జిల్లావ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో సెల్ఫ్ బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు క్రిస్టఫర్, ఆర్సీఎం చర్చి ఫాదర్ జీవన్, బిషప్ సమర్పన్ కుమార్, హెబ్రోన్ సేవకులు జాకోబు, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చిట్యాల పాల్ రాజ్, హెడ్‌మాస్టర్ ప్రభుదాస్, డి. ప్రేమ్ కుమార్, మేడి లక్ష్మయ్య, శౌరయ్య, యాచారం యాకోబ్, చింత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ పిల్లలకు 100% ఫీజు రాయితీ ఇవ్వాలి

**- టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్, డీఈఓ లకు వినతి**

**కామారెడ్డి, జూన్ 11**

**(వుదయం ప్రతినిధి):-**

జిల్లాలోని అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో 100% ఫీజు రాయితీ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ, జిల్లాలో 500 పైగా అర్హులైన జర్నలిస్టులు ఉన్నారు. వీరిలో పేద, మధ్యతరగతికి చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. అందుకని వారి పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో 100% ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ జీవో ప్రకారం 100% రాయితీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ వరప్రసాద్, జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ లకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజేష్ , ఆబిద్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శ్రీనివాస్, జర్నలిస్టులు శివ, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, ముదాం శంకర్, వెంకటేశ్వర్లు, మాణిక్య శ్రీకాంత్, మధు, ప్రభు తదితరులు పాల్గొన్నారు



# గ్రేటర్ హైదరాబాద్



## లాకప్ డెత్ కలకలం: అధికారుల నిర్లక్ష్యమే కారణం.. దళిత, మైనార్టీ ప్రజా సంఘాల మండిపాటు



**వికారాబాద్ జూన్ 11 (వుదయం బ్యూరో)**

కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన జంట హత్యల కేసులో నిందితురాలిగా ఉన్న కరీమాబేగం, పోలీస్ కస్టడీలో ఉండగానే ఆత్మహత్యకు పాల్పడి మరణించడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై దళిత, మైనార్టీ ప్రజా సంఘాలు తీవ్ర స్థాయిలో మండిపడ్డాయి. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ మరణం సంభవించిందని ఆరోపిస్తూ వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రజా సంఘాల ప్రధాన డిమాండ్లు:అధికారుల బాధ్యతారాహిత్యం: నిందితురాలు పోలీస్ కస్టడీలో సురక్షితంగా ఉండాల్సిన బాధ్యత పోలీసులదే. ఆమె ఆత్మహత్య చేసుకోవడం పోలీసు వ్యవస్థలోని లోపాలను, విధి నిర్వహణలో వారు ప్రదర్శించిన నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతుందని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. కఠిన చర్యలు: ఘటన జరిగిన వెంటనే కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం సరిపోదని, దీనికి పరోక్షంగా బాధ్యులైన ఉన్నతాధికారులపై కూడా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.న్యాయం జరగాలి: కరీమాబేగం మరణంపై సమగ్రమైన విచారణ జరిపి, ఆమె కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు: ఒకవేళ తమ డిమాండ్లను ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు పట్టించుకోకపోతే, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.పాల్గొన్న నాయకులు:ఈ ఆందోళన కార్యక్రమం మరియు మీడియా సమావేశంలో పలు ప్రజా సంఘాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు:కే శ్రీనివాస్ (జిల్లా ప్రధాన కార్యదర్శి, సిఐటియు) అబ్దుల్ వాహాబ్ (రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి)గోపి రజక (రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రిజర్వేషన్ రజక సంఘం)*కే చంద్రయ్య (జిల్లా అధ్యక్షులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి)సాధిఖ్ (తాండూర్ ఇంచార్జ్) గుమ్మడి రత్నం (కెవిపిఎస్ నాయకులు) మరియు ఇతర సంఘాల ప్రతినిధులు. పోలీస్ కస్టడీలో ఇలాంటి ఘటనలు జరగడం పట్ల స్థానికంగా ప్రజలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని కోరుతున్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**- దుబ్బాక నియోజకవర్గంలో ₹5.94 కోట్ల విలువైన కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**

**- మల్లన్న సాగర్ కెనాల్స్, గోదాముల నిర్మాణానికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి**

**సిద్దిపేట, జూన్ 11 (వుదయం బ్యూరో)**

అక్బర్ పేటభూంపల్లి మండల కేంద్రంలోని రామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో దుబ్బాక నియోజకవర్గ లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గురువారం పంపిణీ చేశారు. దుబ్బాక, మిరుదొడ్డి, రాయపోల్, తొగుట, దౌల్తాబాద్, అక్బర్ పేటభూంపల్లి మండలాలకు చెందిన 594 మంది లబ్ధిదారులకు ₹5,94,68,904 విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె. హైమావతి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను నిబద్ధతతో అమలు చేస్తోంది. జిల్లాకు 10 వేల ఇళ్లు మంజూరవగా, 80% గ్రౌండింగ్ పూర్తయింది. 5 వేల ఇళ్లకు స్లాబ్‌లు పడ్డాయి. ఈ ఏడాది కూడా మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తాం అన్నారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం విద్యుత్ శాఖకు ₹158 కోట్లు, మహిళల ఉచిత బస్సు ప్రయాణాల కోసం ఆర్టీసికి ₹300 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. జిల్లాలో 45 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశాం. ప్రతి కార్డుదారునికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ భీమాను ₹10 లక్షలకు పెంచాం అని పేర్కొనారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించాం, త్వరలోనే కొత్త పించన్లు ఇస్తాం. స్కూల్ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ఉపాధి నైపుణ్యాల కోసం ₹4,000 కోట్లతో 56 కొత్త ఏటీసీలను ప్రారంభించాం. ఇక్కడ అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాల కోసం శిక్షణ ఇస్తారు. ఈ సీజన్‌లో 30% వరి ధాన్యం అదనంగా పండటం వల్ల కొనుగోలులో కొంత జాప్యం జరిగింది. రైతులు అధైర్య పడొద్దు, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం. ఎరువుల కొరత లేదు అన్నారు. కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకం దేశంలోనే గొప్ప కార్యక్రమమని కొనియాడారు.దుబ్బాక నియోజకవర్గంలో వరి ఎక్కువగా పండినందున గోదాముల నిర్మాణం చేపట్టాలని కోరారు.మల్లన్న సాగర్ మెయిన్ కెనాల్ పూర్తయిందని, సబ్ కెనాల్స్ భూసేకరణ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ కోసం 27 ఎకరాలు కేటాయించామని, వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చంద్రం, మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సంగీత రవీందర్, ఆర్డీఓ సదానందం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీల జేఏసీ ప్రతినిధులు



**హైదరాబాద్: (వుదయం ప్రతినిధి)**

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశంపై హైదరాబాదులోని జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీల జేఏసీ నాయకులు గురువారం ప్రజాభవన్‌లో క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, ఉప ముఖ్యమంత్రి Mallu Bhatti Vikramarkaను కలిశారు. గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టులు స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని జేఏసీ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అవసరాన్ని, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను, అలాగే ఇటీవల ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు, సూచనలను వివరించారు. అదేవిధంగా, ఇటీవల జేఏసీ ప్రతినిధులతో మంత్రి Ponguleti Srinivasa Reddy, మీడియా అకాడమీ చైర్మన్ K. Srinivas Reddy, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డితో జరిగిన సమావేశాల వివరాలను కూడా భట్టి విక్రమార్కకు తెలియజేశారు.

ఈ సందర్భంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శుక్రవారం జరగనున్న క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని చర్చకు తీసుకువస్తామని సూచనప్రాయంగా తెలిపారు.






## గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ డిమాండ్



**- ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల విక్రయాలను సీజ్ చేయాలని విజ్ఞప్తి**

**చేవెళ్ల, జూన్ 11(వుదయం)**

మొయినాబాద్ మండల పరిధిలోని గుర్తింపు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంల విక్రయాలను నిలిపివేసి సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ఎస్ఎఫ్ఐ నాయకులు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)కు వినతిపత్రం సమర్పించారు. విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ2009) నిబంధనలను అన్ని పాఠశాలలు కచ్చితంగా అమలు చేయాలని కోరారు.ఈ సందర్భంగా చరణ్ గౌడ్ మాట్లాడుతూ... ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలను నిర్వహించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని విమర్శించారు.గుర్తింపు లేని పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులు తమ వద్ద నుంచే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయని ఆరోపించారు. దీంతో తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మార్కెట్‌లో ఎక్కడైనా తమకు నచ్చిన చోట విద్యా సామగ్రి కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ ఉండాలని పేర్కొన్నారు.విద్యను వ్యాపారంగా కాకుండా సామాజిక హక్కుగా చూడాలని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు.ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకుని విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్‌తో పాటు మండల నాయకులు వికాస్, నవీన్, అభి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర విజయవంతం

**- తిమ్మాజిపేట, తాడూరులో ఘన స్వాగతం**

**నాగర్ కర్నూల్ జూన్ 11 (వుదయం బ్యూరో)**

పార్లమెంట్ పరిధిలో ఎంపీ మల్లి రవి చేపట్టిన ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు విజయవంతంగా కొనసాగింది.గురు వారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో ప్రారంభమైన యాత్రకు వందలాది కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, మండల ప్రజలు తరలివచ్చి ప్రచార రథానికి బ్రహ్మరథం పట్టారు. రెండో రోజు యాత్ర తాడూరు మండల కేంద్రంలో ఘనంగా సాగింది. తాడూరు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై బస్సు యాత్రకు అపూర్వ ఆదరణ తెలిపారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడమే ఈ బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశమని నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, "నేను రాజకీయాల్లోకి వచ్చింది పదవుల కోసం కాదు, ప్రజా శ్రేయస్సు కోసం. నియోజకవర్గ ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించారు. దానికి నేను సర్వదా రుణపడి ఉంటాను. నియోజకవర్గ అభివృద్ధిలో ముందుంటాను" అని అన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, భూమిలేని నిరుపేదలకు రైతు ఆత్మీయ భరోసా, సన్నవడ్లకు బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత సన్న బియ్యం, నాగర్‌కర్నూల్ జిల్లాలో 550 పడకల ఆసుపత్రి ఏర్పాటు వంటి పథకాలను చేపట్టి అండగా నిలుస్తుందని వివరించారు.ప్రజల సంక్షేమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రెండు మండలాల ప్రజలు బస్సు యాత్రకు అందించిన ఆదరణ కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, సర్పంచ్ మల్లయ్య, మండల అధ్యక్షులు యార రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 4 వార్డ్ లో హైమాక్స్ లైట్లు ప్రారంభం



**జిన్నారం జూన్ 11 (వుదయం ప్రతినిధి)**

గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని 4 వార్డ్ లో నూతనంగా ఏర్పాటుచేసిన ఐమాక్స్ లైటును వార్డ్ కౌన్సిలర్ మద్దూరి కార్తీక్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాత్రి వేళల్లో ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రణాళిక బద్దంగా వార్డులో మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డ్ నంబర్ శివశంకర్, దేవా, స్థానిక నాయకులు వార్డు యువకులు ప్రజలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ, పార్టీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు త్వరలో శిక్షణ




మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

**నాగర్ కర్నూల్ జూన్ 11 (వుదయం బ్యూరో)**

ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం SIR, డిజిటల్ పద్ధతిలో చేపట్టనున్న పార్టీ సభ్యత్వ నమోదుపై BRS కార్యకర్తలకు త్వరలో ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి తెలిపారు. గురువారం నాడు జిల్లా కేంద్రంలోని ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ SIR ప్రక్రియలో BLAల విధులు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త నమోదు, తొలగింపులపై కార్యకర్తలకు స్పష్టత ఇచ్చేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. శిక్షణ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.SIR ప్రక్రియ పూర్తయ్యే వరకు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, శిక్షణకు తప్పనిసరిగా హాజరై పూర్తి అవగాహన పెంచుకోవాలని మర్రి జనార్దన్ రెడ్డి సూచించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత: డిజిపి శిఖా గోయల్

**- సిద్దిపేటలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన సదస్సు**

**ఉచిత కంటి వైద్య శిబిరం - ప్రారంభం.. హెల్మెట్లు, మెడికల్ కిట్ల పంపిణీ**

**సిద్దిపేట/వుదయం బ్యూరో:**

రాష్ట్రంలో సాంప్రదాయ నేరాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళనకరమని తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డిజిపి శిఖా గోయల్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో 'అరైవ్ అలైవ్' (Arrive Alive) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి, , సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, లతో కలిసి ఆమె ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తెరిచారు. ఈ సందర్భంగా డిజిపి శిఖా గోయల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏడాదికి సగటున 800 హత్యలు జరుగుతుంటే, రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 8,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందులో ఎక్కువ ప్రమాదాలు గ్రామీణ రోడ్లపైనే జరుగుతున్నాయని తెలిపారు. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడటం అత్యంత ప్రమాదకరమన్నారు. హెల్మెట్ ధరించడమే కాకుండా, దాని స్ట్రాప్‌ను తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. అనంతరం సదస్సుకు వచ్చిన వారితో ముఖాముఖి మాట్లాడి, ట్రాఫిక్ నియమాలపై సందేహాలను నివృత్తి చేశారు.శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో సామాజిక అవగాహన కల్పించడం పోలీసుల బాధ్యత అని సీపీ రష్మి పెరుమాళ్ పేర్కొన్నారు. ఇటీవల మిట్టపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గుర్తు చేస్తూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డుపై ఎవరైనా స్పృహతప్పి పడిపోతే ప్రాణాలు కాపాడేందుకు వీలుగా ఈ సదస్సులో సీపీఆర్ విధానాన్ని ప్రాక్టికల్‌గా ప్రదర్శించి చూపించారు. సిద్దిపేటను ప్రమాద రహిత జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ వారం రోజుల పాటు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలను ప్రాధాన్యతగా చేపట్టామన్నారు. రోడ్డుపై ప్రమాదం జరిగినప్పుడు ఫోన్లలో వీడియోలు తీస్తూ సమయం వృథా చేయకుండా, వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించి బాధితులను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ఉచిత కంటి అద్దాలు, మెడికల్ కిట్లు మరియు ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను అధికారులు పంపిణీ చేశారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తామని అందరితో రోడ్డు భద్రతా ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కుషాల్కర్, అడిషనల్ డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు



**కుత్బుల్లాపూర్, జూన్ 11 .(వుదయం ప్రతినిధి ).**

టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు సుధీర్ రెడ్డి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ అజయ్ రాజు, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు,నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి పునర్జన్ ఫౌండేషన్ చైర్మన్, ప్రగతినగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొమ్మ వెంకటేశ్వర్ రెడ్డి (తాతిరెడ్డి ), ప్రశాంత్ రెడ్డి, అది రెడ్డి,వ రగాని వాసు

నియోజకవర్గ ముఖ్య నాయకులు,డివిజన్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వచ్చి కేక్ కట్ చేయించి, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## తుర్క చెరువును సుందరంగా అభివృద్ధి చేస్తాం:



**- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

**బాచుపల్లి, జూన్ 11 ,(వుదయం ప్రతినిధి ),**

సిఎంసి నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధి బండారి లేఅవుట్, తుర్క చెరువు ప్రాంతాలలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రజా సమస్యలపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎస్ఎన్డిపి పనుల వంటి వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వర్షం వచ్చిన ప్రతిసారి బండారి లేఔట్ లోని ప్రజలు వరద నీటి సమస్యతో భయాందోళనకు గురయ్యేవారని గత 12 ఏళ్ల కాలంలో ఎస్ఎన్డిపి పనుల ద్వారా వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేశామని

ఎస్ ఎన్ డి పి పనుల ద్వారా బండారి లేఔట్ లో వరద ముంపు తీవ్రతను తగ్గించామని, రానున్న రోజుల్లో కూడా ఎస్ ఎన్ డి పి ఫేస్ 2 పనులను త్వరిత గతిన పూర్తి చేసి వరద ముంపు సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులతో కలసి తుర్క చెరువును సందర్శించిన ఎమ్మెల్యే చెరువులో మురుగునీరు కలవకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మురుగునీటిని బయటకు పంపించి వాకింగ్ ట్రాక్, పిల్లల కోసం ఆట సామాగ్రి తో పాటు చెరువును పూర్తిస్థాయిలో సుందరంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాబేర్ అలీ, ఇరిగేషన్ డీఈ నాయక్, ఈఈ సురేష్ బాబు, వాటర్ వర్క్స్ మేనేజర్ సౌమ్య, ఏఈ రవీంద్ర నాయక్, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ జ్యోతి నరసింహారెడ్డి, చందు ముదిరాజ్, ఆగం రాజు, బాలాజీ నాయక్, గాజుల సుజాత, మాజీ కోఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, సంక్షేమ సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు నరసింహారాజు, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రవి, పద్మావతి, లక్ష్మీ కుమారి, భారతి, శ్రీదేవి, మాన్య తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT HYDERABAD**
**O.S. No.1446 OF 2026**

**Between:**
**Kumari Komanduri Jayashree** D/O Late Komanduri Raghava Chary, Deceased (Mother Name: Komanduri Lakshmi) Sister aged 57 years occ: Nil, R/o. Block-39, Flat-2, 10-3-906, Opp Latest Lucky Bakery, Vijayanagar Colony, VTC: Hyderabad, Hyderabad, Telangana. **...Plaintiffs**

**AND**

1. The Tahsildar, Asif Nagar Mandal, Hyderabad-500028, TG.
2. All concerned. **...Defendants**

To,
ALL CONCERNED, **....Defendant No.2**

PLEASE TAKE NOTICE that the above said Plaintiff has filed the above suit for Declaration of Legal Heir to declare the plaintiff as the legal heir of deceased **Smt. KOMANDURI LAKSHMI,** who died on 07-02-2020 and the same is stand posted to 23-06-2026, if anybody having any objection in the above suit, appear at 10:30 a.m. before this Hon'ble Court in person or by an Advocate, failing which the Hon'ble Court will proceed with the matter as per the law.

***(BY ORDER OF THE COURT)***

Sd/-
**K. Praveena Reddy K. Ramlinga Reddy & Smt. K. Chaitanya Reddy**
**Advocates**
**Office at H.No.2-2-1105/37/C/1, Street No.9, Tilak Nagar, New Nallakunta, Hyderabad -500 044, Telangana.**
**Cell No.92477 80549**

**IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT HYDERABAD**
**O.S. No. 1447 OF 2026**

**Between:**
**Kumari Komanduri Jayashree** D/O Late Komanduri Raghava Chary, aged 57 years occ: Nil, Elder Sister Deceased **Smt. kummaraguntla Padma Gayatri** Block-39, Flat-2, 10-3-906, Opp Latest Lucky Bakery, Vijayanagar Colony, VTC: Hyderabad, Hyderabad, Telangana. **...Plaintiffs**

**AND**

1. The Tahsildar, Asif Nagar Mandal, Hyderabad-500028, TG.
2. All concerned. **...Defendants**

To,
ALL CONCERNED, **....Defendant No.2**

PLEASE TAKE NOTICE that the above said Plaintiff has filed the above suit for Declaration of Legal Heir to declare the plaintiff as the legal heir of deceased **Smt. Kummaraguntla Padma Gayathri,** who died on 07-12-2025 and the same is stand posted to 23-06-2026, if anybody having any objection in the above suit, appear at 10:30 a.m. before this Hon'ble Court in person or by an Advocate, failing which the Hon'ble Court will proceed with the matter as per the law.

***(BY ORDER OF THE COURT)***

Sd/-
**K. Praveena Reddy K. Ramlinga Reddy & Smt. K. Chaitanya Reddy**
**Advocates**
**Office at H.No.2-2-1105/37/C/1, Street No.9, Tilak Nagar, New Nallakunta, Hyderabad -500 044, Telangana.**
**Cell No.92477 80549**



"భారత్‌లో వంటగ్యాస్ ధరలు ప్రపంచంలోనే తక్కువగా ఉన్నాయని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఇక్కడ ధరలు గణనీయంగా చౌకగా ఉన్నాయని వివరించింది. ప్రస్తుతం ఢిల్లీలో సాధారణ వినియోగదారులు సిలిండర్‌కు సుమారు రూ.942 చెల్లిస్తుండగా, ప్రతి సిలిండర్‌పై దాదాపు రూ.700 వరకు ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద 10.58 కోట్లకుపైగా కనెక్షన్లు అందించగా, అర్హులైన లబ్ధిదారులకు ఏడాదికి నాలుగు సిలిండర్లపై ఒక్కో సిలిండర్‌కు రూ.300 సబ్సిడీ ఇస్తున్నట్లు కేంద్రం తెలిపింది."

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

## వే'మన' పద్యం

ఆత్మశుద్ధి లేని ఆచారమది యేల
భాండ శుద్ధి లేని పాకమేల
చిత్త శుద్ధి లేని శివ పూజలేలరా
విశ్వదాభిరామ వినుర వేమా!



# నీట్ లీకేజీ: బాధ్యత ఎవరిది?

భారతదేశంలో విద్యార్థుల పాలిట వైద్యవిద్య అనేది ఒక గొప్ప కల. ఆ కలను సాకారం చేసుకునే క్రమంలో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ సర్వస్వాన్ని ధారపోస్తారు. ఏళ్ల తరబడి కఠినమైన శిక్షణ, లక్షల రూపాయల కోచింగ్ ఫీజులు, రాత్రింబవళ్ల శ్రమ... ఇదంతా ఒక్క రోజు, ఒక్క పరీక్ష కోసం. కానీ, ప్రతి ఏటా ఈ 'నీట్' (NEETUG) పరీక్ష జరుగుతున్న తీరు చూస్తుంటే, విద్యార్థుల కష్టాన్ని, వారి భవిష్యత్తును వ్యవస్థే అపహాస్యం చేస్తోందా అన్న ఆందోళన కలుగుతోంది. దేశవ్యాప్తంగా దాదాపు 22.8 లక్షల మంది అభ్యర్థులను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న 'వన్ నేషన్‌వన్ ఎగ్జామ్' విధానం, ఆచరణలో ఒక 'సింగిల్ పాయింట్ ఆఫ్ ఫెయిల్యూర్' గా మారింది. ఎన్‌టిఏ (NTA) యొక్క నిర్వహణ లోపాలు, ప్రశ్నపత్రాల ప్రింటింగ్, ప్యాకేజింగ్ , లాజిస్టిక్స్ సర్వీసుల విషయంలో మూడవ పార్టీలపై అతిగా ఆధారపడటం ఈ వ్యవస్థను బలహీనపరిచాయి. డిజిటల్ యుగంలో ఇంకా పాత పద్ధతిలో పెన్ అండ్ పేపర్ (OMR) విధానాన్ని కొనసాగించడం, నిరంతర పర్యవేక్షణ లేని భద్రతా రంధ్రాలు, పరీక్షా నిర్వహణలో సాంకేతిక పారదర్శకత లేకపోవడం వల్ల ఈ లీకేజీలు పునరావృతమవుతున్నాయి.

నిజానికి, నీట్ విధానాన్ని తమిళనాడు రాష్ట్రం మొదటి నుంచీ వ్యతిరేకిస్తూ వస్తోంది. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం తన అధికారాలను కేంద్రీకరించడం వల్లనే ఈ గందరగోళం నెలకొందని ఆ రాష్ట్రం వాదిస్తోంది. వారి వాదనలో ఒక సహేతుకమైన కోణం ఉంది. ఇంజనీరింగ్ ప్రవేశాల విషయానికి వస్తే, జేఈఈ (JEE) వంటి జాతీయ స్థాయి పరీక్షలతో పాటు, ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎంసెట్ (EAMCET) వంటి పరీక్షలు ఉన్నాయి. విద్యార్థులకు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. మరి వైద్య విద్యలో ఎందుకు ఆ స్వేచ్ఛ ఉండకూడదు? ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం స్వతంత్రంగా, పారదర్శకంగా వైద్య ప్రవేశ పరీక్షలను నిర్వహించుకుంటే, ఒకే ఒక్క జాతీయ స్థాయి పరీక్ష వల్ల జరిగే అపారనష్టం నుండి లక్షలాది మంది విద్యార్థులను రక్షించవచ్చు కదా! జాతీయ స్థాయి పరీక్షల వల్ల జరిగే విపరీతమైన ఒత్తిడిని, లీకేజీల భయాన్ని తగ్గించడానికి ఇది ఒక నిర్మాణాత్మకమైన మార్గం కాగలదు.

ఈ వైఫల్యం ఒకసారి జరిగినప్పుడు పొరపాటు అనుకోవచ్చు, కానీ ఇది పదే పదే జరుగుతోంది. 2015లో, 2024లో, ఇప్పుడు 2026లో... ప్రతిసారీ ఇదే కథ. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) వ్యవస్థపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉన్న నమ్మకం పూర్తిగా సన్నగిల్లింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మొదట పరిస్థితిని అంచనా వేయడంలో విఫలమై, ఆ తర్వాత కొన్ని చోట్ల అవకతవకలు జరిగాయని అంగీకరించారు. అయితే, వ్యవస్థలో మార్పులు అవసరమని వారు భావిస్తున్నప్పుడు, అది కేవలం ప్రకటనలకే పరిమితం కాకూడదు. ఆచరణలో పారదర్శకత కనిపించాలి. దేశంలో ఎంతో సమర్థవంతమైన, బలమైన ప్రభుత్వం నడుస్తోందని చెప్పుకుంటున్న తరుణంలో, ఒక కీలకమైన జాతీయ స్థాయి పరీక్షను పకడ్బందీగా నిర్వహించలేకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. ఈ లీకేజీల వెనుక ఉన్నది కేవలం బయటి వ్యక్తులు మాత్రమే కాదు; వ్యవస్థ లోపలే ఉన్న వ్యక్తులు కూడా అని సీబీఐ దర్యాప్తులో వెల్లడైన విషయాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. ప్రశ్నపత్రాలను అనువదించే వారు, సబ్జెక్టు నిపుణులు, కొంతమంది టీచర్లు... వీరంతా ఒక గొలుసుకట్టు నెట్‌వర్క్‌లా ఏర్పడి, ప్రభుత్వ రహస్యాలను, లక్షలాది మంది భవిష్యత్తును గాలికొదిలేసి, పేపర్‌ను విక్రయించినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. NTA తన బాధ్యతలను థర్డ్ పార్టీ ఏజెన్సీలకు, ప్రింటింగ్ ప్రెస్‌లకు, లాజిస్టిక్స్ సర్వీసులకు అప్పగించడం వల్ల భద్రతాపరమైన రంధ్రాలు ఎలా ఏర్పడుతున్నాయో ఇది చూపిస్తోంది. బాధ్యతను బదిలీ చేయడం సులభమే కావచ్చు, కానీ దాని వల్ల వ్యవస్థకు కలిగే నష్టం ఎవరూ భర్తీ చేయలేనిది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్, 2024' వంటి కఠినమైన చట్టాలు మనకు అందుబాటులో ఉన్నప్పటికీ, అవి క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. కేవలం అరెస్టులు చేయడం, ఫలితాలను రద్దు చేయడం, రీఎగ్జామ్స్ పెట్టడం అనేవి తాత్కాలిక ఉపశమనాలు మాత్రమే. నిజమైన మార్పు వ్యవస్థాగత ప్రక్షాళనలోనే ఉంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేయాలి. పరీక్షల నిర్వహణలో మనుషుల ప్రమేయాన్ని వీలైనంతగా తగ్గించి, అత్యాధునిక సాంకేతికతతో కూడిన నిఘాను ఏర్పాటు చేయడం అత్యవసరం. ప్రశ్న పత్రాల తయారీ నుండి, పరీక్ష కేంద్రాలకు చేరే వరకు ప్రతి దశలోనూ 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటించాలి. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచి, వ్యవస్థ పట్ల విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉన్న అపనమ్మకాన్ని తొలగించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వంపైనే ఉంది.



# ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం ప్రతీకార రాజకీయాలు

భారత ప్రజాస్వామ్యాన్ని నేడు అత్యంత ప్రమాదకరంగా దెబ్బతీస్తున్న అంశాల్లో "ప్రతీకార రాజకీయాలు" ముందు వరుసలో ఉన్నాయి. ఎన్నికల్లో గెలిచిన పాలకులు అధికారాన్ని ప్రజా సేవకు వినియోగించాల్సిన బదులు.. ప్రత్యర్థులను అణగదొక్కడానికి, కేసులు పెట్టడానికి, అరెస్టులు చేయడానికి, ఆస్తులపై దాడులు జరపడానికి వినియోగిస్తున్నారనే విమర్శలు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. అధికార మార్పు జరిగిన ప్రతీసారి పాలకులు – ప్రతిపక్షాల మధ్య రాజకీయ పోరు వ్యక్తిగత శత్రుత్వంగా మారిపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆందోళనకర సంకేతం.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారా ప్రజలు తీర్పునిస్తారు. ఎన్నికల్లో ఓడినవారు ఆ తీర్పును గౌరవించాలి. గెలిచినవారు ప్రతీకారం తీర్చుకునే అవకాశంగా కాకుండా బాధ్యతగా చూడాలి. కానీ ప్రస్తుత రాజకీయ వాతావరణంలో "అధికారంలో లేకపోతే అంతం" అనే భయం పార్టీలను వెంటాడుతోంది. రాజకీయ ప్రత్యర్థులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED), సీబీఐతో పాటు సంబంధిత ఇతర వ్యవస్థలను వినియోగిస్తున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి.సామాజిక మాధ్యమాల ప్రభావం, కులమతాల విభజన రాజకీయాలు, విద్వేష ప్రచారం ఈ పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి. ప్రత్యర్థిని రాజకీయ ప్రత్యర్థిగా కాకుండా "శత్రువు"గా చిత్రీకరించడం వల్ల ప్రజాస్వామ్య విలువలు దిగజారుతున్నాయి. చివరికి ప్రజా సమస్యలు పక్కకు వెళ్లి వ్యక్తిగత కక్షలు ప్రధాన అంశాలుగా మారుతున్నాయి.పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ఈ పరిస్థితికి ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలిచాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి తృణమూల్ కాంగ్రెస్ దీర్ఘకాల పాలనకు తెరదించడంతో రాజకీయ హింస చెలరేగింది. పలువురు కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. తృణమూల్ కార్యాలయాలపై దాడులు, నాయకులు, కార్యకర్తలపై ప్రతీకార చర్యలు మనం చూస్తున్నాము.ఈ నమక్రమంలోనే తృణమూల్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై సోనార్పూర్‌లో జరిగిన దాడి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన ఆయనపై గుడ్లు, రాళ్లు విసిరి నినాదాలు చేయడం రాజకీయ వాతావరణం ఎంత విషపూరితంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. తృణమూల్ దీనిని "బీజేపీ ప్రేరేపిత దాడి"గా అభివర్ణిస్తే, బీజేపీ మాత్రం తృణమూల్ గత పాలనలో జరిగిన "గూండారాజ్"కు ఇది ప్రజల ప్రతిస్పందన అని వాదిస్తోంది. అయితే ఇక్కడ ప్రధాన ప్రశ్న –పాలకులు మారినా రాజకీయ సంస్కృతి ఎందుకు మారడం లేదనేదే?

ఇదే పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో కూడా కనిపిస్తోంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ నేతలపై కేసులు, అరెస్టులు, కార్యాలయాల కూల్చివేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై చర్యలు వివాదాస్పదమయ్యాయి. వైఎస్సార్‌సీపీ వీటిని "రాజకీయ కక్షసాధింపు"గా అభివర్ణిస్తుంటే, టీడీపీ మాత్రం జగన్ ప్రభుత్వ కాలంలో కూడా ఇలాంటి లక్ష్యబద్ధ చర్యలు జరిగాయని చెబుతోంది. అధికార మార్పు జరిగినప్పుడల్లా ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే పరిస్థితి రాష్ట్ర అభివృద్ధిని వెనక్కి నెడుతోంది.అమరావతి రాజధాని వివాదం, సంక్షేమ పథకాల మార్పులు, పరస్పర ఆరోపణలు ఏపీలో తీవ్ర ప్రతీకారాలకు కారణమవుతున్నాయి.ఇవన్నీ ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రతీకారానికే ప్రాధాన్యం పెరిగిందనే భావనను బలపరుస్తున్నాయి. ప్రజలు అభివృద్ధి కోసం ఓటేస్తే, పాలకులు పాత కక్షలు తీర్చుకోవడంలో సమయం వెచ్చించడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. దేశవ్యాప్తంగా బీజేపీపై కూడా ఇదే తరహా ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతల ఇళ్లపై ఈడీ, సీబీఐ దాడులు జరగడం, తరువాత కొందరు నాయకులు అధికార పార్టీలో చేరగానే కేసులు నెమ్మదించడం వంటి పరిణామాలు ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. అవినీతిని నిరోధించడం తప్పనిసరి అయినప్పటికీ, చర్యలు పక్షపాతంగా కనిపిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థలపై విశ్వాసం సన్నగిల్లేలా చేస్తుంది.

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ప్రతిపక్షాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు వస్తుంటే, బీజేపీ మాత్రం చట్టం తన పని తాను చేస్తోందని చెప్పుకుంటూ వస్తోంది. ఇదే విధంగా ప్రాంతీయ పార్టీల పాలనలోనూ అధికార దుర్వినియోగ ఆరోపణలు కొనసాగుతున్నాయి. అంటే సమస్య ఒక్క పార్టీకి పరిమితం కాదు, మొత్తం రాజకీయ వ్యవస్థలోనే ప్రతీకార సంస్కృతి బలపడుతోంది.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడతాయి. నిజాయితీ గల వ్యక్తులు రాజకీయాల్లోకి రావడానికి వెనుకాడతారు. ప్రజలు రాజకీయాలపై విసుగు చెందుతారు. చివరికి ప్రజాస్వామ్యం ఎన్నికలకే పరిమితమై, పరస్పర కక్షల రంగస్థలంగా మారిపోతుంది.ఈ రకమైన వైఖరికి ముగింపు పలకాలంటే కొన్ని కీలక సంస్కరణలు అవసరం. దర్యాప్తు సంస్థలకు రాజకీయ జోక్యం లేకుండా స్వతంత్రత కల్పించాలి. పోలీసు వ్యవస్థను ఆధునీకరించాలి. రాజకీయ నేరాల విచారణకు వేగవంతమైన న్యాయవ్యవస్థ అవసరం. ఎన్నికల ఖర్చులపై కఠిన నియంత్రణలు తీసుకురావాలి. ముఖ్యంగా రాజకీయ పార్టీలు నేర చరిత్ర కలిగిన వ్యక్తులను ప్రోత్సహించడం మానుకోవాలి.అంతిమంగా ప్రజలే అసలు తీర్పుదారులు. ద్వేషం, ప్రతీకారం, హింసను ప్రోత్సహించే నాయకులను ప్రజలు తిరస్కరించినప్పుడే రాజకీయ సంస్కృతి మారుతుంది. అధికారాన్ని సేవగా కాకుండా శత్రు నిర్మూలన సాధనంగా చూసే రాజకీయ ధోరణి కొనసాగితే భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.ప్రతీకార రాజకీయాలు ఏ పార్టీకి అంతగా లాభం చేకూర్చదు. నేటి పాలకుడు రేపటి ప్రతిపక్షం కావచ్చు. అందుకే నాయకులు రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య సంస్కృతిని కాపాడే దిశగా నడవాలి.



బత్తుల సత్యనారాయణ :జర్నలిస్ట్
9963991120

# బాల్యాన్ని ఇటుక బట్టీల్లో కాల్చేయవద్దు

అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్వచనం ప్రకారం, బాలల్ని ఉపాధులు లేదా ఉద్యోగాల ఉచ్చులో బంధించి వారి బాల్యాన్ని, శక్తియుక్తులను, గౌరవాన్ని, సంపూర్ణ ఎదుగుదలను, శారీరక మానసిక ఆరోగ్యాన్ని హరింపజేసే లేదా నలిపి వేసే ప్రయత్నాలను బాల కార్మిక వ్యవస్థ అని అంటాం. అంతర్జాతీయ, జాతీయ చట్టాలు, నియమనిబంధనలకు వ్యతిరేకంగా పిల్లలను (5 నుంచి 17 ఏండ్ల లోపు) కార్మికులుగా మార్చి వారి బంగారు భవితను బుగ్గిపాలు చేయడాన్ని బాల కార్మిక దురాచారం అని అర్థం చేసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా నేటికీ 160 మిలియన్ల బాల కార్మికుల బతుకులు ఉపాధుల పేరుతో బుగ్గిపాలు అవుతున్నాయి. వీరిలో వయస్సు 5 11 ఏండ్ల లోపు ఉన్న బాలలు 48 శాతం, 12 14 ఏండ్ల వారు 28 శాతం, 15 17 ఏండ్ల లోపు పిల్లలు 24 శాతం ఉండడం గమనించారు. ఆఫ్రికాలో 20 శాతం బాలలు, ఏసియా పసిపిక్‌లో 7 శాతం, అమెరికన్లు 11 శాతం, యూరోప్‌సెంట్రల్ ఆసియాలో 4 శాతం, అరబ్ ప్రాంతాల్లో 3 శాతం బాల కార్మికులు నమోదు అవుతున్నారు. ప్రపంచ బాల కార్మికుల్లో దాదాపు 56 శాతం మధ్య ఆదాయ దేశాల్లోనే ఉండడం ఆశ్చర్యంగా ఉన్నది.

భారతంలో బాల కార్మిక దురాచారం:

బాల కార్మిక వ్యవస్థను రూపు మాపడంలో భారత్ కొంత ప్రగతిని సాధించినప్పటికీ మరింత దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం ఏర్పడుతున్నది. 2011 వివరాల ప్రకారం, 5 14 ఏండ్ల లోపు బాల కార్మికులు 43.53 లక్షల ఉన్నారని, 2001లో వీరి సంఖ్య 1.26 కోట్లు ఉండేదని గమనించాలి. పేదరికం, నిరక్షరాస్యత, సామాజికఆర్థిక సమస్యలతో బాల కార్మిక వ్యవస్థ ప్రధానంగా ముడిపడి ఉంటుంది. భారత బాల కార్మికులు అధికంగా వ్యవసాయం, నిర్మాణ రంగం, ఇటుక బట్టీలు, బాణాసంచా తయారీ కేంద్రాలు, కార్పెట్ పరిశ్రమ, మైనింగ్, రెస్టారెంట్లు లాంటి రంగాల్లో మగ్గుతున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం 14 ఏండ్ల లోపు పిల్లలను చట్టవ్యతిరేకంగా పనిలో పెట్టుకోవడం లేదా ప్రమాదకర పరిస్థితుల్లో బతుకులను గడపడం చట్టవ్యతిరేకమని తెలుపుతున్నది. బాల కార్మిక దురాచారాన్ని రూపుమాపడానికి 1986 బాల కార్మిక చట్టం, 2017 బాల కార్మిక చట్ట సవరణ, 1987లో బాల కార్మికుల జాతీయ పాలసీ లాంటివని తేవడం, అమలు పరచడం జరుగుతున్నది.



ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం 2026:

ఐరాసఅంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ)యూనిసెఫ్ సంయుక్త చొరవతో ప్రతి ఏట 12 జూన్‌న "ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం (వరల్డ్ డే అగెనెస్ట్ చైల్డ్ లేబర్)"ను పాటించడం ఆనవాయితీగా మారింది. ఈ వేదికగా బాల కార్మిక దురాచారాన్ని కట్టడి చేయడం, అవగాహన కల్పించడం, కఠినంగా చట్టాలు అమలు చేయడం, బాలలకు/కుటుంబాలకు సరైన సహాయాలు అందించడం లాంటివి జరుగుతున్నాయి. 2026 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం ఇతివృత్తంగా "బాలకార్మిక వ్యవస్థకు రెడ్ కార్పెట్ : బాలలకు న్యాయమైన ఆట, పెద్దలకు గౌరవప్రదమైన పని" అనబడే అంశాన్ని తీసుకున్నారు. బాలలు చదువుకోవడం, ఆడు కోవడం, సురక్షిత బాల్యం కొనసాగడానికి మాత్రమే అవకాశం కల్పించాలని కుటుంబ పెద్దలు తెలుసుకోవాలి. పిల్లల శ్రమను దోపిడీ చేయడం, చిన్నారి చేతులకు/దేహానికి/మనస్సుకు గాయాలు చేయడం, బాలల బంగారు భవిష్యత్తును ఆదిలోనే తుంచేయడం అమానవీయం, ఆక్షేపణీయం అని నినదించాలి. బాల కార్మిక దురాచార నిర్మూలనకు సవాళ్లు:

బాల కార్మిక దురాచార నిర్మూలనకు సవాళ్లుగా పేదరికం, నిరక్షరాస్యత, తల్లితండ్రుల నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, విద్యకు దూరంగా ఉండడం, సామాజిక కట్టుబాట్లు, చట్టాల అమలులో నిర్లక్ష్యం, సామాజిక అంగీకారం, ప్రలోభ యాజమాన్యాలు, అవగాహన లోపం, పౌర సమాజ నిశ్శబ్దం లాంటివి అడ్డుగా నిలుస్తున్నాయి. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి తీసుకోవలసా చర్యల్లో పేదరిక నిర్మూలన, తల్లితండ్రులకు ఉద్యోగ ఉపాధుల కల్పన, పాఠశాలల అందుబాటు, అక్షరాస్యత/అవగాహన పెంచడం, సామాజిక భద్రత కల్పించడం, ప్రభుత్వాలు/పౌర సమాజం/అంతర్జాతీయ సంస్థల సమైక్య కృషి, విద్యపై పెట్టుబడులు పెంచడం, నైపుణ్యాల వృద్ధి, వయోజనులకు ఉద్యోగ కల్పన లాంటివి నిత్యం కొనసాగాలి. బాలల ఆరోగ్య సంరక్షణ, పిల్లల గౌరవాన్ని కాపాడడం, విద్య అవకాశాలు కల్పన, ఆటపాటల కొనసాగింపుకు గట్టి కృషి జరగాలి. ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న బాలల మనసులకు పడుతున్న తూట్లు, విరుగుతున్న ఎముకలు, శ్వాస ఇబ్బందులు, శారీరక గాయాలు, విష రసాయనాల దుష్ప్రభావాలు, ఆందోళనలు, మానసిక ఒత్తిడి, భావోద్వేగ సమస్యలు, సామాజికశారీరకమానసిక ఎదుగుదల సమస్యలు, చిన్నారుల శ్రమ దోపిడీ లాంటివి బాల్యాన్ని చిదిమేయడం నేటి డిజిటల్ యుగంలో సహితం జరగడం సోచనీయం. ఇప్పటికైనా బాల కార్మిక దురాచారాన్ని ప్రపంచం నుంచి పాతాళానికి తరిమేద్దాం, బాలలకు పూర్తి స్వేచ్ఛనిద్దాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# కళను ప్రజల హృదయాల్లో నిలిపిన చలసాని

తెలుగు సాంస్కృతిక, పత్రికా రంగాల సుదీర్ఘ చరిత్రలో కొన్ని పేర్లు కేవలం వ్యక్తులుగా కాక, ఒక నిశ్శబ్ద విప్లవానికి, అచంచలమైన సృజనాత్మక శక్తికి ప్రతీకలుగా నిలిచిపోతాయి. అటువంటి అరుదైన, మహోన్నత శక్తులలో చలసాని ప్రసాదరావు అగ్రగణ్యులు. శారీరక వైకల్యాల పరిమితులను అధిగమించి, ముఖ్యంగా ఒక మేధావికి అత్యంత ఆవశ్యకమైన వినికిడి శక్తిని కోల్పోయినప్పటికీ, ఆ శూన్యాన్ని అక్షరాలతో, రంగులతో పూరించి తెలుగు చిత్రకళా సాహిత్యానికి ఒక దిశా నిర్దేశం చేసిన ప్రజ్ఞాశాలి ఆయన. చిత్రకారుడిగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా, అద్భుతమైన కళా విమర్శకుడిగా ఆయన సాగించిన బహుముఖ ప్రయాణం తెలుగు భాషా సాహిత్య చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయం. తెలుగులో చిత్రకళా రంగంపై ప్రామాణికమైన, విశ్లేషణాత్మకమైన గ్రంథాలు దాదాపు శూన్యంగా ఉన్న కాలంలో ఆ కొరతను తీర్చడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. కేవలం సృజనకే పరిమితం కాకుండా, కళను సామాన్య మానవుడి మేధస్సుకు చేర్చాలనే తపనతో ఆయన చేసిన కృషి అద్వితీయమైనది.

చలసాని ప్రసాదరావు జన్మవృత్తాంతం, బాల్య నేపథ్యం పరిశీలిస్తే ఆయన విజయాల వెనుక ఉన్న కఠోర శ్రమ, అచంచలమైన ఆత్మవిశ్వాసం స్పష్టమవుతాయి. కృష్ణా జిల్లా మొవ్వ మండలంలోని భట్ల పెనుమర్రు గ్రామంలో 1939 అక్టోబరు 27న ఒక సాధారణ కర్షక కుటుంబంలో ఆయన జన్మించారు. నాటి గ్రామీణ వాతావరణం, ఆర్థిక పరిమితులు ఆయన బాల్యాన్ని చుట్టుముట్టాయి. విద్యాభ్యాసం కోసం ఆయన 1949-50 కాలంలో ఉత్తరాంధ్ర ప్రాంతాలైన విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలోనే సంభవించిన ఒక తీవ్రమైన అనారోగ్యం ఆయన జీవిత గమనాన్నే మార్చేసింది. ప్రాణాంతకమైన టైఫాయిడ్ వ్యాధి బారిన పడి ఆయన తన వినికిడి శక్తిని పూర్తిగా కోల్పోయారు. సమాజంతో శబ్ద సంబంధం తెగిపోయిన ఆ క్లిష్ట తరుణంలో, నిరాశకు లోనవ్వకుండా జ్ఞాన సముపార్జన వైపు అడుగులు వేశారు. ఈ పరిణామంలో ఆయన మేనమామ వెల్లంకి సుగుణ భూషణరావు పోషించిన పాత్ర చారిత్రాత్మకమైనది. ప్రసాదరావులో పుస్తక పఠనం పట్ల అమితమైన ఆసక్తిని రేకెత్తించి, అక్షరాలనే ఆయనకు ప్రాణాధారంగా మార్చారు. అలా బాహ్య ప్రపంచపు శబ్దాలు మూగబోయినా, పుస్తకాల అంతర్గత శబ్దాలు ఆయనను సరికొత్త ఆలోచనా ప్రపంచంలోకి నడిపించాయి. జీవితంలో స్థిరపడటానికి, పేదరిక నిర్మూలనకు ఆయన అతి పిన్న వయసులోనే శ్రమజీవిగా మారాల్సి వచ్చింది. 1951 నుండి 1956 వరకు, అంటే తన పన్నెండో ఏట నుంచే 'ప్రజాశక్తి', 'విశాలాంధ్ర' వంటి కమ్యూనిస్ట్ భావజాల పత్రికలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా, చిన్న ఉద్యోగిగా పని చేశారు. ఈ ఐదేళ్ల కాలం ఆయనకు సమకాలీన సామాజిక, రాజకీయ, సాహిత్య ఉద్యమాలపై పట్టు సాధించేలా చేసింది. అనంతరం వరంగల్ నగరానికి వలస వెళ్లి, అక్కడ ప్రసిద్ధ 'కాకతీయ' వారపత్రికలో అసోసియేట్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సంపాదకీయ అనుభవం ఆయనలోని రచనా నైపుణ్యాన్ని, వార్తల విశ్లేషణా సామర్థ్యాన్ని పదును పెట్టింది. దృశ్య మాధ్యమాల ద్వారా ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో ఆయన తన విశేష నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆ కాలంలో భారతీయ చిత్రకళా రంగంలో ఎం.ఎఫ్. హుస్సేన్, సతీష్ గుజ్రాల్, పిటి రెడ్డి వంటి ఆధునిక చిత్రకారులు సరికొత్త ప్రయోగాలు చేస్తున్నారు. కానీ తెలుగు సమాజంలో ఆ పరిణామాలను విశ్లేషించే, సామాన్యులకు అర్థమయ్యేలా వివరించే సాహిత్య వనరులు మృగ్యంగా ఉన్నాయి. ఈ శూన్యాన్ని గమనించిన ప్రసాదరావు, తెలుగులో 'కళా విమర్శ' అనే ఒక నూతన ప్రక్రియకు పునాది వేయాలని సంకల్పించారు. 1971లో 'వసుధ' పత్రికకు సంపాదకత్వం వహించడం ద్వారా సాహిత్య, సామాజిక అంశాలపై గంభీరమైన చర్చలను లేవనెత్తారు. ఆయన ప్రతిభను, నిశిత పరిశీలనా శైలిని గుర్తించిన రామోజీరావు నేతృత్వంలోని 'ఈనాడు' యాజమాన్యం 1974లో ఆయనను ఆదివారం అనుబంధానికి పార్ట్‌టైమ్ ఎడిటర్‌గా ఆహ్వానించింది. ఆపై 1975లో ఆయన సామర్థ్యానికి పూర్తి స్థాయి గుర్తింపుగా 'ఈనాడు' ఆదివారం సంచిక బాధ్యతలను అప్పగించింది. ఆ తర్వాత కాలంలో 'విపుల', 'చతుర' వంటి విశిష్ట కథా, నవలల మాసపత్రికలకు సంపాదకుడిగా వ్యవహరించి, తెలుగు పత్రికా రంగంలో పేజీల రూపకల్పన, కంటెంట్ సెలెక్షన్‌లో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పారు. చలసాని ప్రసాదరావు సాహిత్య జీవితంలో ఒక అద్భుతమైన మలుపు, తెలుగు పాఠకులకు నిరంతర వైజ్ఞానిక విందుగా మారిన శీర్షిక 'కబుర్లు'. ఈనాడు దినపత్రికలో ఈ శీర్షికను ఆయన వెయ్యి వారాలకు పైగా నిరాఘాటంగా నిర్వహించి ఒక అరుదైన రికార్డును సృష్టించారు. పత్రికా రంగంలో ఒకే శీర్షిక అంత సుదీర్ఘకాలం పాటు, ఏమాత్రం జిగి, బిగి తగ్గకుండా, పాఠకుల్లో ఆసక్తిని సడలనివ్వకుండా సాగడం ఒక అసాధారణమైన ప్రక్రియ. అసలు ఈ 'కబుర్లు' శీర్షిక వెనుక ఒక పెద్ద చరిత్రే ఉంది. ఆయన కేవలం చదువరులకు క్షణికమైన వినోదాన్ని పంచాలని ఆశించలేదు; సమాజంలో జరుగుతున్న పరిణామాలపై పాఠకుడు ఆలోచించేలా, అంతర్మథనం చెందేలా చేయడమే తన పరమావధిగా పెట్టుకున్నారు. హాస్యాన్ని ఒక పైపూతగా వాడుకుంటూనే, సమాజంలోని కుళ్లును కడిగిపారేసే వ్యంగ్య బాణాలను ఆయన సంధించారు. ప్రతి వారం వచ్చే ఈ కబుర్ల కోసం నాటి అక్షరాస్యులు, మేధావులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూసేవారంటే ఆ రచనలో ఉన్న సామాజిక బలం, భాషా పటిమ ఎలాంటివో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. క్లిష్టమైన విషయాలను సైతం దైనందిన జీవితంలో మాట్లాడే కబుర్ల రూపంలోకి మార్చి, ఆ వచనానికి ఒక సాహిత్య గౌరవాన్ని తీసుకువచ్చిన ఘనత చలసాని ప్రసాదరావు గారిది. చలసాని ప్రసాదరావు సాహిత్య సేవలో అత్యంత అగ్రభాగం ఆక్రమించేది ప్రపంచ చిత్రకళను తెలుగు వారికి పరిచయం చేయడం. పాశ్చాత్య దేశాలలో సంభవించిన పునరుజ్జీవన యుగం నాటి లియోనార్డో డా వించి, మైఖేలాంజెలో లార్డ్స్ నుండి ఆధునిక యుగపు పికాసో, వాన్‌గోగ్, సాల్వడార్ డాలీ వరకు గల ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారుల జీవితాలను, వారి కళా సిద్ధాంతాలను అత్యంత సరళమైన శైలిలో తెలుగులోకి అనువదించి, విశ్లేషించారు. క్యూబిజం, ఇంప్రెషనిజం, సర్రియలిజం వంటి జటిలమైన ఆధునిక కళా ఉద్యమాలను సామాన్య పాఠకుడికి సైతం ఆకట్టుకునేలా వివరించడం ఆయనకే చెల్లింది. భరతుని నాట్యశాస్త్రం, భారతీయ శిల్పకళా రహస్యాలు, అజంతా, ఎల్లోరా గుహల వైభవం, లేపాక్షి శైలి వంటి ప్రాచీన సంప్రదాయాలను వివరిస్తూనే, జానపద కళారూపాలలోని సౌందర్యాన్ని ఆయన తన వ్యాసాల ద్వారా ఆవిష్కరించారు. కళ అనేది కొద్దిమంది మేధావుల డ్రాయింగ్ రూములకు లేదా గ్యాలరీలకు పరిమితం కాకూడదని, అది ప్రజా బాహుళ్యంలోకి వెళ్లినప్పుడే సార్థకత చేకూరుతుందని ఆయన బలంగా విశ్వసించారు. ఇందుకోసం ఆయన రాసిన వందలాది వ్యాసాలు, గ్రంథాలు నేటికీ లలితకళల అకాడమీలలో, విశ్వవిద్యాలయాలలో ప్రామాణిక పాఠ్యగ్రంథాలుగా చలామణి అవుతున్నాయి.చిత్రకారుడిగా ఆయన శైలి అత్యంత విలక్షణమైనది. రేఖల సరళత, రంగుల సమపాళ్ల కలయిక, భావవ్యక్తీకరణలో నిగూఢత ఆయన చిత్రాల ప్రత్యేకత. ఆయన వేసిన అనేక చిత్రాలు సామాజిక స్పృహను, మానవీయ విలువలను ప్రతిబింబించేవిగా ఉండేవి. ఒకవైపు పత్రికా సంపాదకుడిగా తీరిక లేని బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మరోవైపు రంగుల ప్రపంచంలో పరిశోధనలు సాగించడం,



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# హెచ్.ఎం. రెడ్డి: తెలుగు సినిమా ఆద్యుడు

తెలుగు సినిమా చరిత్రను పరిశీలించిన



ప్రతీసారీ ముందు కనిపించే వ్యక్తిత్వం హెచ్.ఎం. రెడ్డి – హనుమప్ప మునియప్ప రెడ్డి. ఆయన తెలుగు సినిమాకు శబ్దాన్ని ఇచ్చిన దర్శకుడు, తొలి టాకీ చిత్రానికి దర్శకుడు, నిర్మాణానికి పునాదులు వేసిన విజనరీ. 1892 జూన్ 12న మద్రాసు ప్రెసిడెన్సీ లోని అనంతపురం జిల్లా చిత్తంపల్లి గ్రామంలో జన్మించిన ఆయన, బాల్యంలో నుంచే నాటకాలపై మక్కువ కలిగి, అనంతపురంలో విద్యాభ్యాసం పూర్తిచేశారు.తరువాత ముంబైకి వెళ్లిన హెచ్.ఎం. రెడ్డి, అక్కడి రాయల్ టర్ఫ్ క్లబ్‌లో ఉద్యోగం చేస్తూ, సినిమాలపై ఆసక్తిని పెంచుకున్నారు. కొల్హాపూర్‌లో బాబురావు పెయింటర్ వద్ద దర్శకత్వ విద్యాభ్యాసం పూర్తి చేసిన అనంతరం, బొంబాయిలో అర్దేషీర్ ఇరానీ స్థాపించిన ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో చేరి, స్క్రిప్టింగ్, సహాయ దర్శకత్వంలో అనుభవాన్ని సంపాదించారు.భారతదేశ తొలి టాకీ చిత్రం "ఆలం ఆరా" (1931) విజయాన్ని చూసిన వెంటనే, తెలుగులో కూడా టాకీ చిత్రాన్ని తీసే సంకల్పంతో ఆయన ముందుకొచ్చారు. ధర్మవరం రామకృష్ణమాచార్యుల రచన ఆధారంగా, ముంబైలోని ఇంపీరియల్ ఫిలిం కంపెనీ భాగస్వామ్యంతో 1931లో "భక్త ప్రహ్లాద" చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం వహించారు. ఆయన చిత్రాలు పౌరాణికం నుంచి సామాజిక అంశాల వరకు విస్తరించాయి. "ద్రౌపదీ వస్త్రాపహరణం" (1936) వంటి పౌరాణిక చిత్రాలతో పాటు, "ఇల వేలుపు" (1951), "నిర్దోషి" (1951), "ఎవరు దొంగ" (1961), "పూజ" (1967) వంటి సామాజిక చిత్రాలతోనూ ఆయన విలక్షణతను చూపించారు. కథన శైలిలో లోతు, పాత్రలలో సజీవత, సాంకేతిక నైపుణ్యంలో చాతుర్యం ఆయన దర్శకత్వాన్ని ప్రత్యేకంగా నిలిపాయి. కమలాకర కామేశ్వరరావు, సదాశివ బ్రహ్మం, కొండముది గోపాల రాయ శర్మ, మల్లాది వెంకటకృష్ణ శర్మ, కొవ్వలి, భమిడిపాటి కామేశ్వర రావు, శ్రీశ్రీ ఇలా ఎందరో మహామహులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనులు హెచ్.ఎమ్.రెడ్డి

కేవలం సినిమాలు తీయడమే కాకుండా, పరిశ్రమకు మౌలిక నిర్మాణాన్ని కల్పించాలన్న లక్ష్యంతో 1947లో చెన్నైలో "రోహిణి పిక్చర్స్" అనే తొలి తెలుగు నిర్మాణ సంస్థ స్థాపించారు. ఈ సంస్థ ద్వారా పలు ప్రతిభావంతులను తెలుగు సినీ ప్రపంచానికి పరిచయం చేశారు. తరువాతి రోజుల్లో వచ్చిన బి.ఎన్. రెడ్డి, కె.వి. రెడ్డి, ఎల్.వి. ప్రసాద్ వంటి దర్శకులపై ఆయన ప్రభావం స్పష్టంగా కనిపించింది. మద్రాసులో రోహిణి స్టూడియో కట్టారు. ప్రయోగాలు చెయ్యడంలో కూడా హెచ్.ఎమ్.దిట్ట. సినిమాను కేవలం వినోదంగా కాకుండా, సమాజంలోని సమస్యలపై చైతన్యం కలిగించే మాధ్యమంగా ఆయన అభివృద్ధి చేశారు. పాత్రలలో తాత్వికత, కథలలో సందేశాత్మకత, దృశ్యాలలో నైతికతను సమపాళ్లలో మిళితం చేసి ప్రేక్షకుల మనస్సుల్లో స్థిరమైన ముద్రవేశారు. హెచ్.ఎం. రెడ్డి 1960 జనవరి 14న కన్ను మూశారు.

# జాతీయం-అంతర్జాతీయం



## మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై
# ఏఐసీసీ గరంగరం

### అత్యవసరంగా భేటీ అయిన కాంగ్రెస్ అగ్రనేతలు

**న్యూఢిల్లీ జూన్ ,11 (ఏ.ఎం.ఎస్)**
కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ అత్యవసరంగా సమావేశమైంది. గురువారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమైంది. పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పీసీసీ అధ్యక్షులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ్య నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తోసిపుచ్చిన అంశం ప్రధానంగా ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. దీనికి సంబంధించి భవిష్యత్ కార్యచరణపై సమావేశంలో చర్చించారు. త్వరలోనే నిర్ణయాన్ని ఏఐసీసీ ప్రకటించనుంది.

# న్యాయమూర్తిపైనే ఆరోపణలు

**విచారణలో వివక్ష చూపారంటూ ఢిల్లీ కోర్టు సంచలన నోటీస్!**



**న్యూఢిల్లీ జూన్ ,11 (ఏ.ఎం.ఎస్)**
ఢిల్లీ న్యాయ వ్యవస్థలో ఒక అరుదైన, సంచలన పరిణామం చోటుచేసుకుంది. రెండు వేర్వేరు క్రిమినల్ ఫిర్యాదుల కేసులను విచారిస్తున్న ఒక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌పై పక్షపాత వైఖరి, నిబంధనల ఉల్లంఘన వంటి తీవ్ర ఆరోపణలు రావడంతో.. ఆ కేసుల విచారణ ప్రక్రియపై ఉన్నత కోర్టు స్టే విధించింది. నిందితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన ఢిల్లీ ప్రిన్సిపాల్ జిల్లా సెషన్స్ జడ్జి విజయ్ కుమార్ దహియా.. సదరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోమల్‌కు నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా దీనిపై సీల్డ్ కవర్‌లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.న్యాయమూర్తి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, అందువల్ల తమ కేసులను వేరే కోర్టుకు బదిలీ చేయాలంటూ ఇద్దరు నిందితులు వేర్వేరుగా జిల్లా కోర్టులో ట్రాన్స్‌ఫర్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో ఒక పిటిషన్‌ను అద్విక్ క్యాపిటల్ లిమిటెడ్ వర్సెస్ ఫెయిర్‌ప్లాన్ డిస్ట్రిబ్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కేసులో నిందితుడైన అమిత్ సరోగి దాఖలు చేయగా.. మరొక పిటిషన్‌ను రాజేష్ కుమార్ కౌశిక్ వర్సెస్ విపిన్ శర్మ అండ్ అదర్స్ కేసులో నిందితుడిగా ఉన్న దయానంద్ రాయ్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపిస్తూ.. కనీస చట్టపరమైన నిబంధనలను కూడా పాటించకుండా మేజిస్ట్రేట్ కోర్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు. సాధారణంగా క్రిమినల్ కేసుల్లో నిందితులకు సమన్లు జారీ చేయడానికి ముందు 'ప్రీ సమ్మనింగ్' ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ఆ ప్రాథమిక ప్రక్రియలేవీ పూర్తి కాకముందే నిందితులకు నేరుగా నోటీసులు జారీ చేశారని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా ఈ కేసులను కోర్టు అసాధారణమైన తొందరపాటుతో ముందుకు తీసుకెళ్తోందని.. ఇదే కోర్టులో విచారణ కొనసాగితే తమకు న్యాయమైన విచారణ లభిస్తుందనే నమ్మకం లేదని పిటిషనర్లు తమ పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేశారు.

## హర్మూన్ జలసంధిని
# మూసేసిన ఇరాన్

- **అనుమతి లేకుండా నౌకలు వస్తే అంతే సంగతులంటూ హెచ్చరిక**



**టెహ్రాన్**
: ఇరాన్‌పై అమెరికా భీకర దాడులకు తెగబడిన విషయం తెలిసిందే. ఇరాన్‌లోని పలు కీలక ప్రాంతాలపై క్షిపణులతో దాడి చేస్తోంది. యూఎస్ దాడులకు ప్రతిదాడులకు దిగింది ఇరాన్. గల్ఫ్ దేశాల్లోని యూఎస్ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ సేనలు దాడులు చేశాయి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జల సంధిని మూసివేస్తామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐ.ఆర్.జీ.సీ.)ప్రకటించింది.
తమ అనుమతి లేకుండా ఈ జల మార్గం గుండా రాకపోకలు సాగిస్తే.. తగిన మూల్యం చెల్లించుకుంటారని ఆ సంస్థ తన అధికారిక టెలిగ్రామ్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నట్లు సీఎన్‌ఎన్ ఉటంకించింది. ఈ నేపథ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జల సంధిని మూసివేస్తామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐ.ఆర్.జీ.సీ.)ప్రకటించింది. మరో వైపు ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అదనపు ఆత్మరక్షణ దాడులను ప్రారంభించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ బుధవారం (స్థానిక కాలమానం ప్రకారం) ప్రకటించింది. దురాక్రమణ చర్యలకు ప్రతిస్పందనగా ఈ చర్య చేపట్టినట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు.

# వీబీ- గ్రామ్ జీకి తాత్కాలిక కేటాయింపులు

- **రూ.95,692 కోట్లలో బీజేపీ పాలిత రాష్ట్రాలకే అత్యధికం**
**యూపీకి రూ.9,721 కోట్లు..**
**పశ్చిమ బెంగాల్‌కు రూ.8,508 కోట్లు**
**తెలంగాణకు రూ.3825 కోట్లు.**
**. ఏపీకి రూ.7702 కోట్లు**



**న్యూఢిల్లీ ,జూన్ ,11 (ఏ.ఎం.ఎస్)**
వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) (వీబీ గ్రామ్ జీ) కింద 202627 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్రం రూ.95,692.31 కోట్ల తాత్కాలికంగా నిధుల కేటాయింపును ప్రకటించింది. అయితే ఇందులో బీజేపీ పాలిత రాష్ట్రాలకు సింహ భాగం కేటాయించింది. యూపీకి అత్యధికంగా రూ.9,721.48 కోట్లు రాగా, పశ్చిమ బెంగాల్ రూ.8,508 కోట్లు అందుకోనుంది. ఇతర రాష్ట్రాలకు వాటి అవసరాలు, గత వ్యయాల ఆధారంగా నిధులు కేటాయించినట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన ఈ వీబీ గ్రామ్ జీ తీవ్ర వివాదాన్ని రాజేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు దీని అమలుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్రాలవారీగా ఈ తాత్కాలిక కేటాయింపులు జరిపింది. గత ఆర్థిక సంవత్సరంలో ఎంజీఎన్‌ఆర్‌జీఈఎస్ కింద రాష్ట్రాలు చేసిన ఖర్చును ప్రాతిపదికగా తీసుకొని ఈ తాత్కాలిక కేటాయింపులు జరిగాయని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

**ఇటీవలే ముసాయిదా నిబంధనలు విడుదల**
ఇటీవలే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కొత్త వీబీగ్రామ్ జీ చట్టం అమలుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ ఏడాది జులై 1 నుంచి ఈ పథకం అమలులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే తుది నిబంధనలు ఇంకా అమల్లోకి రాకముందే రాష్ట్రాలకు నిధుల ప్రవాహం ఆగిపోకుండా ఉండేందుకు ఈ మధ్యంతర కేటాయింపులు జరిపినట్టు సమాచారం. కొత్త పథకం కింద రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీకి 16వ ఆర్థిక సంఘం సూచించిన ప్రమాణాలను అనుసరించాలని ముసాయిదా నిబంధనల్లో పేర్కొన్నారు. జనాభా అభివృద్ధి స్థాయి, భౌగోళిక పరిస్థితులు వంటి అంశాలు భవిష్యత్తు కేటాయింపుల్లో కీలక పాత్ర పోషించనున్నాయి.

**రాష్ట్రాలపై ఆర్థిక భారం**
అయితే కొత్త పథకం అమలులో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో కార్మికుల వేతన భారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించేది. కానీ వీబీ గ్రామ్ జీ పథకం కేంద్ర ప్రాయోజిత పథకంగా మారింది. ఇందులో కేంద్రంరాష్ట్రాల మధ్య వ్యయభారం 60:40 నిష్పత్తిలో ఉండనుంది. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ ప్రాంత రాష్ట్రాలు, శాసనసభ కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాలకు 90:10 నిష్పత్తి వర్తించనుంది. శాసనసభ లేని కేంద్ర పాలిత ప్రాంతాల విషయంలో మాత్రం మొత్తం వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించనుంది. అయితే మోడీ సర్కారు తీసుకొచ్చిన ఈ మార్పుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం పడనుంది. ఈ నేపథ్యంలో కొత్త పథకం అమలు ఎలా సాగుతుందన్నది చర్చనీయాంశంగా మారింది.

**టాప్-10 రాష్ట్రాలు**
వీబీ గ్రామ్ జీ కింద తాత్కాలిక నిధుల కేటాయింపులో బీజేపీ, ఎన్డీఏ పాలిత రాష్ట్రాలకే అధిక మొత్తంలో దక్కాయి. యూపీ, పశ్చిమ బెంగాల్ తర్వాతి స్థానాల్లో ఏపీ, తమిళనాడు, రాజస్తాన్, బీహార్, మధ్యప్రదేశ్, కర్నాటక మహారాష్ట్ర, తెలంగాణలు ఉన్నాయి. ఏపీకి రూ.7702.21 కోట్లు కేటాయించగా, తెలంగాణకు 3,825.31 కోట్లు దక్కాయి.

# యూకే ప్రధానిపై చైనా గూఢచర్యం



**నాలుగేళ్లుగా ఆయన వాహనంలో సీక్రెట్ ట్రాకింగ్ డివైజ్**

**బ్రిటన్ :**
చైనాకు చెందిన ఓ రహస్య పరికరం బ్రిటన్ ప్రధాని వాహనంలో బయటపడింది. అయితే, దీనిని గుర్తించడానికి నాలుగేళ్ల ముందు నుంచే అందులో ఉన్నట్టు తెలిసి అధికారులు షాకయ్యారు. చైనా నుంచి వాహనం తయారీకి దిగుమతి చేసుకునే విడి భాగాల్లోనే దీనిని అమర్చి ఉంచారని, సీల్ చేసి ఉండటంతో అలాగే వాహన తయారీదారు దానిని వాడినట్టు అధికారులు తెలిపారు. ఈ డివైజ్ కేవలం ప్రధాని వాహనానికి మాత్రమే పరిమితం కాలేదని అంటున్నారు. అయితే, 2023లో యూకే మంత్రులు, కన్జర్వేటివ్ ప్రభుత్వంపై చైనా నిఘా పెట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. యునైటెడ్ కింగ్డమ్‌లో భారీ భద్రతా వైఫల్యం కలకలం రేపుతోంది. ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ ఉపయోగించే ప్రభుత్వ వాహనంలో చైనా ట్రాకింగ్ డివైజ్‌ను బ్రిటిష్ నిఘా అధికారులు గుర్తించారు. లొకేషన్ డేటాను పంపగల ఈ పరికరం.. చైనా నుంచి దిగుమతి చేసుకున్న ఒక సీల్డ్ కాంపోనెంట్‌లో అమర్చి ఉందని, తనిఖీల్లో బయటపడటానికి ముందు సుమారు నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తోందన్న టెలిగ్రాఫ్ నివేదిక సంచలనంగా మారింది. విదేశీ గూఢచర్య ముప్పును తిప్పికొట్టేందుకు నిఘా అధికారులు, భద్రతా సిబ్బంది ప్రభుత్వ, దౌత్య అధికారుల వాహనాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ నెట్‌వర్క్ బయటపడింది. టెలిగ్రాఫ్ ఉటంకించిన నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. వాహన తయారీదారుకు ఆ విడిభాగాన్ని పంపే ముందే చైనాకు చెందిన ఓ సబ్‌సప్లయర్ ఆ ట్రాకింగ్ పరికరాన్ని ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ (ECU) లో అమర్చాడు. యూనిట్ సీల్ చేసి ఉండటం వల్ల వాహన తయారీదారుకు తెలియకుండానే దానిని ఆ వాహనంలో అమర్చారు. బ్రిటన్ మాజీ మంత్రి డంకన్ స్మిత్ కూడా దీనిని ధ్రువీకరించారు. ప్రధాని అధికారిక వాహనాలైన రేంజ్ రోవర్ సెంటినెల్స్‌లో ఉన్న ఈ డివైజ్‌లను గుర్తించడానికి భద్రతా దళాలు వాటి భాగాలను పూర్తిగా విడదీయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.ఈ గూఢచర్యం కేవలం ప్రధాని కారుకు మాత్రమే పరిమితం కాలేదని, పాశ్చాత్య సరఫరా గొలుసులను దెబ్బతీయడానికి చైనా అవలంబిస్తున్న ఒక విస్తృతమైన, ఆటోమేటెడ్ వ్యూహంలో భాగమని నిఘా అధికారులు భావిస్తున్నారు. విడి భాగాలను భారీ ఎత్తున తయారు చేస్తారు కాబట్టి సాధారణ పౌరుడిదైనా లేదా ఒక దేశ ప్రధానిదైనా వీటిని ఉపయోగించే ప్రతి వాహనం కూడా ఒక ట్రాకింగ్ పరికరంగా మారిపోతుంది.

# ఫీఫా ప్రపంచ కప్ 2026లో కలకలం

**లియోనెల్ మెస్సీ పాస్‌పోర్ట్ డేటా లీక్**




**ఐస్‌ల్యాండ్ :**
ప్రపంచంలో అత్యధిక ఆదరణ కలిగిన క్రీడల్లో ఫుట్ బాల్ ముందు వరుసలో ఉంటుంది. మ్యాచ్‌లను చూసేందుకు కోట్లాది మంది. మరి అలాంటి ఫుట్ బాల్ సంగ్రామం జూన్ 11 నుంచి ప్రారంభం కానుంది. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఈ ప్రపంచ కప్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. కానీ, ఈ టోర్నీ ప్రారంభానికి ముందు అనేక వివాదాల్లో ఇరుక్కొంటోంది. తాజాగా, ప్రపంచ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీ, ఆయన సహచరుల పాస్‌పోర్ట్ డేటా ఇప్పుడు లీకయ్యింది. మరో 24 గంటల్లో ప్రారంభం కానున్న ఫీఫా ప్రపంచ కప్ 2026ను వరుస వివాదాలు వెంటాడుతున్నాయి. తాజాగా, లియోనెల్ మెస్సీతో పాటు ఆయన అర్జెంటీనా సహచరుల పాస్‌పోర్ట్ డేటా లీక్ అయ్యింది. మంగళవారం ఐస్‌లాండ్‌తో జరిగిన ప్రపంచ కప్‌కు ముందు వార్మప్ మ్యాచ్ కోసం అర్జెంటీనా జట్టులోని లియోనెల్ మెస్సీతో సహా ప్రతి ఆటగాడి పాస్‌పోర్ట్ వివరాలు, ఒక భద్రతా లోపం కారణంగా లీక్ అయ్యాయని రాయిటర్స్ వార్తా సంస్థ ఒక నివేదికలో పేర్కొంది. అధికారిక జట్టు జాబితాలో ఉన్న పాస్‌పోర్ట్ నంబర్లు, మీడియా, ప్రజలకు విడుదల చేసే ముందు వాటిని బ్లర్ చేయాల్సి ఉంది. కానీ అలబామాలోని జోర్డాన్‌హేర్ స్టేడియంలో వాటిని ఎటువంటి మార్పులు చేయకుండానే విడుదల చేశారు. కానీ, ఐస్‌లాండ్ ఆటగాళ్లు తమ పాస్‌పోర్ట్ వివరాలను సమర్పించకపోవడంతో అవి బయటకు రాలేదు. దీనిపై స్పందించాల్సింగా అర్జెంటీనా ఫుట్ బాల్ ఫెడరేషన్, ఫీఫాను రాయిటర్స్ సంప్రదించింది. ఫిఫా ప్రపంచకప్‌ను చుట్టుముట్టిన వివాదాల్లో ఇది తాజాది. ప్రపంచకప్‌లో పాల్గొనడానికి వచ్చిన సెనెగల్ ఆటగాళ్లను అమెరికాలోని విమానాశ్రయంలో మితిమీరిన భద్రతా తనిఖీలకు గురిచేశారంటూ వచ్చిన ఒక వీడియో తీవ్ర కలకలం రేపింది. సాడియో మానే, కాలిడౌ కౌలిబాలీ వంటి సూపర్ స్టార్స్ ఉన్న ఈ సెనెగల్ జట్టు... విమానం దిగిన తర్వాత శాన్ ఆంటోనియోలోని ఎయిర్‌పోర్ట్ టార్మాక్‌పైనే మెటల్ డిటెక్టర్లతో భద్రతా తనిఖీలు చేయించుకుంటుండగా ఎవరో వీడియో తీసినట్లు ఆరోపణలు వచ్చాయి. స్పెయిన్ వంటి జట్లకు ఇలాంటి కఠినమైన నిఖీలు చేయలేదని, కేవలం సెనెగల్ జట్టుకే ఎందుకు చేశారని పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. న్యూయార్క్‌లో ఉజ్బెకిస్థాన్ జట్టుకు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైందని మరికొందరు ఆరోపించారు. మరోవైపు, అమెరికాలో ప్రవేశానికి అనుమతించకపోవడంతో సోమాలియాకు చెందిన ప్రపంచకప్ రెఫరీ ఒకరు బుధవారం తన దేశానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు మద్దతుదారులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తదుపరి ప్రపంచకప్‌లో తాను భాగం కావాలని కోరుకుంటోన్నానని, సోమాలియా యువత తమ దేశాన్ని చూసి గర్వపడాలని పిలుపునిచ్చారు.
టోర్నమెంట్ కోసం ఫీఫా తుది జాబితాలో చోటు దక్కించుకున్న తర్వాత ఒమర్ అర్తాన్ ప్రపంచ కప్‌లో అధికారికంగా వ్యవహరించనున్న సోమాలియాకు చెందిన మొదటి రిఫరీ కానున్నారు. ఆఫ్రికాలోని అగ్రశ్రేణి రిఫరీలలో ఒకరైన ఆయన.. 2025లో ఆ ఖండంలోని ఉత్తమ పురుష రిఫరీగా ఎంపికయ్యారు. శనివారం మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలో అతడ్ని అడ్డుకోవడంపై అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ స్పందించింది. భద్రతాపరమైన ఆందోళన కారణంగా అనుమతించలేదని ఒక ప్రకటనలో తెలిపింది. అయితే ఆ వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో ఆయన టోర్నమెంట్ రిఫరీల జాబితా నుంచి ఫీఫా తొలగించింది.
గత వారం అర్తాన్‌కు అమెరికా పర్యటనకు వీసా జారీ అయిందని, దానిని ప్రాసెస్ చేసిన కెన్యాలోని సోమాలియా రాయబార కార్యాలయం తెలిపింది. అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. మియామిలోని వారి శిక్షణా కేంద్రంలో ఇతర ప్రపంచ కప్ రిఫరీలను అర్తాన్ కలవాల్సి ఉంది.

# దీదీకి మరో షాక్



- **పార్టీకి, ఎంపీ పదవికి ప్రకాశ్ చిక్ బరైక్ రాజీనామా**

**కలకత్తా ,జూన్ ,11 (ఏ.ఎం.ఎస్)**
బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో దీదీ (మమతా బెనర్జీ) ఓటమి తర్వాత టీఎంసీ అంతర్గత విభేదాలతో రెండు ముక్కలవుతోంది. ఇప్పటికే పార్టీలోని ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ ఆధ్వర్యంలో రెండు వర్గాలుగా చీలారు. ఈ క్రమంలోనే తాజాగా టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి మరో రాజ్యసభ ఎంపీ షాక్ ఇచ్చారు. ఎంపీ పదవీతో పాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఎంపీ ప్రకాష్ చిక్ బరైక్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం రాజ్యసభ చైర్మన్ సిపి. రాధాకృష్ణన్‌కు లేఖ రాశారు. తన రాజీనామాను తక్షణమే ఆమోదించాలని కోరారు. ఒక వారంలో ముగ్గురు ఎంపీలు టీఎంసీకి రాజీనామా చేయడం గమనార్హం.
రెండు రోజుల క్రితం టీఎంసీ ఎంపీ సుష్మితా దేవ్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే.
ఆమె రాజీనామాను రాజ్యసభ చైర్మన్ ఆమోదించారు.



## పశ్చిమాసియాలో అమెరికా భీకర దాడులు
# ధీటుగా బదులిస్తున్న ఇరాన్

**టెహ్రాన్ :**
పశ్చిమాసియాలో మరోసారి భీకర దాడులకు తెరలేపింది అమెరికా. ఒకవైపు శాంతి చర్చల పేరుతో కాల్పుల విరమణ ప్రకటించిన ట్రంప్.. తాజాగా వైమానిక దాడులకు తెగబడ్డారు. డెహ్రాన్, సిరిక్, మినాబ్, బందర్ అబ్బాస్ ప్రాంతాలపై మిసైళ్ల వర్షం కురిపించింది అమెరికా. దీంతో ఆయా ప్రాంతాలలో పేలుడు శబ్దాలు వినిపించాయి. మరోవైపు ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టంలో కూడా యాక్టివేట్ చేసింది. అంతకు ముందు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా కీలక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని బాంబులు వేసున్నట్టు వెల్లడించారు. దీంతో మళ్లీ రెండు దేశాల మధ్య భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయి.అమెరికా దాడులను కూడా ఇరాన్ దీటుగా బదులిచ్చింది. కువైట్, బహ్రెయిన్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ప్రతిదాడులు చేసింది. తమ దేశంలోని మువాఫాక్ సాల్టీ వైమానిక స్థావరం లక్ష్యంగా దూసుకొచ్చిన ఐదు క్షిపణులను కూల్చివేసినట్లు జోర్డాన్ తెలిపింది.

## శబరిమల బంగారం చోరీ కేసులో
# కీలక మలుపు

**హైకోర్టు ముందుకు పోలీసుల ఫైనల్ రిపోర్ట్!**



**తిరువునంతపురం, జూన్ ,11 (ఏ.ఎం.ఎస్)** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయ పసిడి దొంగతనం కేసు మళ్లీ న్యాయస్థానం ముందుకు వచ్చింది. ఈ వివాదంపై కేరళ హైకోర్టుకు చెందిన 'దేవస్వం బెంచ్' సోమవారం నుంచి విచారణను పునఃప్రారంభించనుంది.
దాదాపు ఏడు నెలలుగా సాగుతున్న ఈ దర్యాప్తునకు సంబంధించిన తుది నివేదికను.. ప్రత్యేక విచారణ బృందం (ఎస్ఐటీ) నేడు కోర్టుకు సమర్పించనుంది. జంషెడ్‌పూర్‌లోని ప్రయోగశాలలో ఆలయ బంగారు పలకలపై నిర్వహించిన ఫోరెన్సిక్ ల్యాబ్ పరీక్షల ఫలితాలను కూడా ఎస్ఐటీ ఈ సందర్భంగా కోర్టుకు వివరించే అవకాశం ఉంది. జస్టిస్ ఎ. బద్రుద్దీన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న ఆలయ ప్రధాన అర్చకుడి బెయిల్‌ను రద్దు చేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌పై సుదీర్ఘంగా విచారణ జరపనుంది. కేరళలో కొత్తగా ఎన్నికైన యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ప్రభుత్వం ఈ సున్నితమైన అంశంపై కోర్టులో ఎలాంటి చట్టపరమైన వైఖరిని తీసుకోబోతుందనేది ఇప్పుడు రాజకీయ, ఆధ్యాత్మిక వర్గాలలో ఆసక్తికరంగా మారింది. గతంలో విజిలెన్స్ కోర్టు దర్యాప్తు మధ్యలో చేసిన కొన్ని వ్యాఖ్యలు అనవసరమని పేర్కొన్న హైకోర్టు.. బెయిల్ ఉత్తర్వుల అర్హతలపై పూర్తిస్థాయిలో విచారిస్తామని స్పష్టం చేసింది.

# దేశవ్యాప్తంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు

**13 కల్లా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలంటూ డిమాండ్**




**న్యూఢిల్లీ జూన్ , 11 (ఏ.ఎం.ఎస్)**
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ గురువారం నుంచి దేశ వ్యాప్తంగా పలుచోట్ల ఆందోళనలు చేపట్టింది. గురువారం పుణె నగరంతో ప్రారంభించి లక్నవూ, అమృత్‌సర్, బెంగళూరు, జైపూర్, హైదరాబాద్‌లలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపింది. పోటీ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ ఈ నెల 13వ తేదీకల్లా కేంద్రమంత్రి రాజీనామా చేయాలని కోరింది.లేని పక్షంలో ఈ నెల 20వ తేదీ నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరవధిక ధర్నా చేపట్టనున్నట్లు హెచ్చరించింది. విద్యా వ్యవస్థను కాపాడుకొనేందుకు జరిపే ఈ పోరాటంలో దేశ వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. కాగా పర్యావరణవేత్త సోనమ్ వాన్‌చుక్ పుణెలో జరిపే నిరసనలో పాల్గొంటున్నట్లు సీజేపీ ఫౌండర్ అభిజీత్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# లండన్‌లో భారత సంతతి కుటుంబం మృతి

**36వ అంతస్తు నుంచి పడి దంపతులు సహా తొమ్మిదేళ్ల బాలుడు దుర్మరణం**



**లండన్ :**
: బ్రిటన్ రాజధాని లండన్‌లో.. ఓ భారత సంతతి కుటుంబం ఎవరూ ఊహించని విధంగా చనిపోయింది. ముఖ్యంగా వారు 45 అంతస్తుల ఎత్తైన అపార్ట్‌మెంట్‌లోని 36వ అంతస్తులో నివాసం ఉంటుంగా.. అక్కడి నుంచి పడే భార్యాభర్తలు సహా తొమ్మిదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయారు. అయితే వీరు ముగ్గురూ కలిసే ఆత్మహత్య చేసుకున్నారా లేక వీరిలోని ఒకరే ఇద్దరిని చంపేసిన ఆపై ఆత్మహత్య చేసుకున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిసే వరకు మీడియా ఎలాంటి కథనాలను సృష్టించవద్దని చెప్పుకొచ్చారు.

**అసలేం జరిగిందంటే..?**
భారత సంతతికి చెందిన 47 ఏళ్ల రాకేష్ నారాయణ్ పాయ్, 46 ఏళ్ల అదితి విజయ్ పారాల్కర్‌లు భార్యాభర్తలు. అయితే వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు సిద్ పాయ్ పారాల్కర్ ఉన్నాడు. వీరంతా ప్రస్తుతం దక్షిణ లండన్‌లోని ఎలిఫెంట్ అండ్ క్యాజిల్ పరిధిలోని చర్చియార్డ్ రోలో ఉన్న 'హైపాయింట్' అనే 45 అంతస్తుల విలాసవంతమైన అపార్ట్‌మెంట్ టవర్‌లోని 36వ అంతస్తులో నివాసం ఉంటున్నారు. అయితే మే 27వ తేదీ ఉదయం సుమారు 7.30 గంటల సమయంలో వీరు ముగ్గురూ 36వ అంతస్తు నుంచి కింద పడ్డారు. ఒక్కసారిగా భారీ శబ్దం అవుతూ.. వారు కింద పడడాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే వారి వద్దకు పరుగులు పెట్టారు. ఓవైపు అంబులెన్సుకు, మరోవైపు పోలీసులు సమాచారం ఇచ్చి.. వారికి సాయం చేసే ప్రయత్నం చేశారు. అయితే మెట్రోపాలిటన్ పోలీస్ అధికారులతో పాటు లండన్ అంబులెన్స్ సర్వీస్, ఎయిర్ అంబులెన్స్, ఫైర్ బ్రిగేడ్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్ర గాయాలపాలైన ఆ ముగ్గురిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే వారు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇదిలా ఉండగా.. ఈ ఘోర విపత్తుపై బ్రిటన్ పోలీసులు నిఘా పెట్టారు. వీరంతా ఆత్మహత్య చేసుకున్నారా, లేక ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే బ్రిటీష్ మీడియా కథనాల ప్రకారం మాత్రం.. రాకేష్‌యే తన భార్య, కుమారుడిని చంపేసి ఆపై ఆత్మహత్య చేసుకున్నట్లు వివరిస్తున్నారు. ఇందుకు కారణాలను కూడా సదరు సంస్థలు వెల్లడించాయి.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## 48 పాఠశాలలకు ప్రీ-ప్రైమరీ బోధకులు, ఆయాల నియామకం

**వరంగల్ జిల్లా జూన్ 11 (వుదయం ప్రతినిధి) :**


LIST OF 48 SELECTED SCHOOLS FOR THE OPENING OF PRE-PRIMARY SE... DISTRICT

202627 విద్యా సంవత్సరానికి గాను వరంగల్ జిల్లాలోని 48 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ బోధకులు (ఇన్‌స్ట్రక్టర్లు) మరియు ఆయాల (ఆయాలు) తాత్కాలిక నియామకానికి జిల్లా విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రీప్రైమరీ బోధకుల పోస్టులకు ఇంటర్మీడియట్ (10+2) ఉత్తీర్ణులై ఉండాలని, ఆయాల పోస్టులకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు. అభ్యర్థులు సంబంధిత గ్రామ పంచాయతీ లేదా డివిజన్ పరిధిలో నివసిస్తూ ఉండాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 19వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు సంబంధిత మండల విద్యాశాఖ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. స్థానికత, విద్యార్హతల ఆధారంగా మెరిట్ ప్రకారం ఎంపికలు చేపడతారు. దరఖాస్తు సమర్పించే సమయంలో అసలు ధృవపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా అందజేయాలని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళలకు 5 సంవత్సరాలు, మాజీ సైనికోద్యోగులకు 3 సంవత్సరాలు, దివ్యాంగ మహిళలకు 10 సంవత్సరాల వయోపరిమితి సడలింపు వర్తిస్తుందని తెలిపారు. ఎంపికైన ప్రీప్రైమరీ బోధకులకు నెలకు రూ.8,000, ఆయాలకు రూ.6,000 గౌరవ వేతనం చెల్లిస్తారు. కనీసం రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్, నర్సరీ టీచర్ ఎడ్యుకేషన్, ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ లేదా బీఈడ్ (నర్సరీ) పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన నిర్వహించబడతాయని, అవసరమైతే ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే సేవలను రద్దు చేసే అధికారం విద్యాశాఖకు ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు బోధకుల పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత ధృవపత్రాలు, ఆయాల పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణత ధృవపత్రాలను దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా జత చేయాలని అధికారులు సూచించారు. ఎంపిక చేసిన 48 పాఠశాలల జాబితాను కూడా విద్యాశాఖ విడుదల చేసింది.

## సీజనల్ వ్యాధుల కట్టడికి సమన్వయంతో చర్యలు

**- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, జూన్ 11 (వుదయం ప్రతినిధి)**



వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సీజనల్ వ్యాధుల నియంత్రణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యాధుల నియంత్రణకు పారిశుద్ధ్య పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, 'డ్రై డే ఫ్రై డే' కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఫీవర్ సర్వే ప్రతి గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించి, అనుమానిత కేసులను గుర్తించి తక్షణమే వైద్య సేవలు అందించాలి. దోమల నివారణ కోసం దోమల పెరుగుదలను అరికట్టేందుకు మురుగు కాల్వలను శుభ్రం చేయడంతో పాటు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వినియోగించాలి. మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులను 101010 క్లస్టర్లుగా విభజించి, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ద్వారా పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాలి. సురక్షిత తాగునీరు, నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేస్తూ ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని అందించాలి. హాస్టళ్లపై నిఘా, పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి మల్లిఖార్జున రావు, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, డిఆర్డీఓ భాస్కర్, ఇంచార్జి డీపీవో వెంకట్ రెడ్డి, విద్యా శాఖ ఇంచార్జి ఏడీ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో లాడ్జీలు, బస్టాండ్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 11 (వుదయం ప్రతినిధి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు భద్రాచలంలో పోలీసులు విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి 12.30 గంటల నుంచి తెల్లవారుజామున 5.00 గంటల వరకు పట్టణంలోని లాడ్జీలు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అనుమానిత వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించడమే లక్ష్యంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

భద్రాచలం పట్టణంలోని మొత్తం 62 లాడ్జీలతో పాటు స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఫింగర్ ప్రింట్ పరికరాలు, డాగ్ స్క్వాడ్ బృందాల సహాయంతో లాడ్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు.

సోదాల సందర్భంగా లాడ్జీల యజమానులు, మేనేజర్లు, సిబ్బంది వివరాలను సేకరించడంతో పాటు, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజ్‌ను కనీసం రెండు నెలల పాటు భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే లాడ్జీల వెలుపల రహదారిపై వాహనాల రాకపోకలు స్పష్టంగా రికార్డు అయ్యే విధంగా కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీఎస్పీ వెల్లడించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



## నిమ్స్ హైదరాబాద్

**ఖమ్మం వుదయం బ్యూరో జూన్ 12**

**బాధిత మైనర్ బాలిక పరిస్థితి చూసి చలించిపోయిన మంత్రి తుమ్మల**
**మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ డైరెక్టర్‌కు ఆదేశం**
**ధైర్యంగా ఉండాలంటూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున భరోసా**

నగరంలో లైంగికదాడి గురై తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్ లో చికిత్స పొందుతున్న మైనర్ బాలికను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు నిమ్స్ లో చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితిని చూసి తుమ్మల చలించి పోయారునిమ్స్ డైరెక్టర్ రాహుల్ తో తుమ్మల మాట్లాడారుబాలికకు అందుతున్న వైద్య చికిత్సల వివరాలను తెలుసుకున్నారు మెరుగైన వైద్యం అందించాలని ఎటువంటి పరిస్థితి ఎదురైనా ముందు తనకు తెలియజేయాలని తుమ్మల నిమ్స్ డైరెక్టర్ కు సూచించారుబాలిక తల్లిదండ్రులతో తుమ్మల మాట్లాడి ధైర్యం చెప్పారు తాను అండగా ఉంటానని ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని రకాల సహాయం అందిస్తానని తెలిపారుఐసిడిఎస్ అధికారులతో మాట్లాడిన తుమ్మల బాలికతో పాటు బాలిక తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారుఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని తుమ్మల నిమ్స్ అధికారులకు తెలిపారు

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**: మంత్రి కోమటిరెడ్డి**

**నల్గొండ, జూన్ 11 (వుదయం ప్రతినిధి)**



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈనెల 17న నల్గొండ జిల్లా కనగల్‌లో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.14,500 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హ్యాం రోడ్ల నిర్మాణ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, ఆర్ అండ్ బి అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో హ్యాం రోడ్ల శంకుస్థాపన కార్యక్రమం, బహిరంగ సభ వేదిక, పైలాన్ ఏర్పాటు, భద్రతా చర్యలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. సభకు హాజరయ్యే ప్రజల కోసం టెంట్లు, కుర్చీలు, తాగునీరు తదితర సౌకర్యాలను సమృద్ధిగా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. అలాగే ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించే అవకాశాలపై పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. దేవాలయ ఆధునికీకరణకు సంబంధించిన శిలాఫలకాలు, ఇతర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, కనగల్‌లో ముఖ్యమంత్రి సభ, హ్యాం రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాలకు సంబంధించిన ప్రదేశాలను జిల్లా ఎస్పీతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. భద్రతా ఏర్పాట్లతో పాటు వేదిక, పైలాన్ ఏర్పాటు అంశాలను కూడా పరిశీలించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు,
మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బదిలీపై వెళ్లిన అధికారులు అందించిన సేవలు అభినందనీయం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి జూన్ 11 (వుదయం జిల్లా ప్రతినిధి)**

బదిలీపై వెళ్లిన అధికారులు అందించిన సేవలు అభినందనీయం అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు బదిలీపై జగిత్యాల జిల్లాకు వెళ్లిన జిల్లా రవాణ శాఖ అధికారి మహమ్మద్ సంధాని, క్వాలిటీ కంట్రోల్ ఈఈగా వెళ్లిన భూపాలపల్లి డివిజన్ ఈఈ బసవ ప్రసాద్, పరకాల ఉద్యాన అధికారిగా నియమితులైన జిల్లా ఉద్యాన అధికారి సునీల్ కుమార్ గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను కలిసి మొక్కను అందించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహించిన కాలంలో అధికారులు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా తమ తమ బాధ్యతల్లో ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

### డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.డి. రాంకుమార్



**హనుమకొండ, జూన్ 11 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలోని అన్ని రకాల జాతీయ, రాష్ట్ర స్థాయి ఆరోగ్య కార్యక్రమాలను ప్రోగ్రాం అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని (మానిటరింగ్ చేయాలని) హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి.
రాంకుమార్ ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న టీబీ (క్షయ), ఎన్సీడీ (అసంక్రమిత వ్యాధులు), మాతా శిశు సంక్షేమం, ఇమ్యునైజేషన్ (టీకాల కార్యక్రమం) తదితర కార్యక్రమాల పురోగతిపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రత్యేక దృష్టి నిర్దేశిత లక్ష్యాల సాధనలో వెనుకబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHC), పట్టణ ఆరోగ్య కేంద్రాలు (UPHC), సబ్‌సెంటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలి. కారణాల అన్వేషణ లక్ష్యాలను అందుకోలేకపోవడానికి గల కారణాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిని వెంటనే అధిగమించాలి. వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి హనుమకొండ జిల్లాను రాష్ట్రంలోనే అత్యుత్తమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ మహేందర్, డాక్టర్ మురళి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ రుబీనా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కోలా రాజేశ్, డెమో అశోక్ రెడ్డి, స్టాటిస్టికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, డాక్టర్ నవీన్, డీపీఓ రుక్మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాలపై దృష్టి సారించాలి

**ఖమ్మం జూన్ 11 (వుదయం ప్రతినిధి) :**

ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముంపు ప్రాంతాల స్థితిగతులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

## ఏఐ వినియోగంతో పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుంది

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట జూన్,11వుదయం ప్రతినిధి**

ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ పనితీరులో వేగం, సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ప్రతి అధికారి, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని, తమ విధుల్లో అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. శిక్షణలను కేవలం హాజరుకే పరిమితం చేయకుండా, నేర్చుకున్న విషయాలను ఆచరణలో చూపించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు త్వరితగతిన, నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాలకు సమయపాలనతో హాజరై, నేర్చుకునే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, మాస్టర్ ట్రైనర్స్ వాసుదేవన్ నటరాజన్ దేవరాజ్, రాహుల్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు మేళాలో మంత్రి సీతక్క పిలుపు

### ఆధునిక పద్ధతులు, సేంద్రియ సాగుతోనే రైతులకు అధిక లాభాలు

- రసాయన ఎరువులు తగ్గించి భూసారాన్ని కాపాడుకోవాలి
- రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదే
- గోవిందరావుపేటలో ఘనంగా జిల్లా స్థాయి మెగా రైతు మేళా

**గోవిందరావుపేట/ములుగు, జూన్ 11(వుదయం ప్రతినిధి) :**




రైతులు సంప్రదాయ సాగుకే పరిమితం కాకుండా, ఆధునిక వ్యవసాయ పద్ధతులు మరియు పంటల మార్పిడి విధానాలను అవలంబించి అధిక లాభాలు సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. గురువారం గోవిందరావుపేట మండలం సోమలగడ్డ క్రాస్ వద్ద గల పీఎస్ఆర్ గార్డెన్‌లో వ్యవసాయ శాఖ, ఆత్మ (ATMA) సౌజన్యంతో నిర్వహించిన 'జిల్లా స్థాయి మెగా రైతు మేళా'కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి సీతక్క మాట్లాడుతూ, వ్యవసాయంలో అధిక రసాయనాల వాడకం అనేక అనర్థాలకు దారితీస్తుందని, సేంద్రియ వ్యవసాయం ద్వారానే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని అన్నారు. శాస్త్రవేత్తలు, అధికారులు అందించే సాంకేతిక సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం,**

తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే అతి పెద్ద రుణమాఫీ కింద రూ.21 వేల కోట్లను విడుదల చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. రైతు భరోసాతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అలాగే, పట్టాలు లేకపోయినా సాగు భూములు ఉన్న రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ములుగు జిల్లాలో వేలాది ఎకరాల్లో విస్తరిస్తున్న ఆయిల్ పామ్ సాగును పోడు, బీడు భూముల్లో కూడా చేపట్టి రైతులు ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను ఎంచుకుంటూ, నూతన సాంకేతికత ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ.. రైతులకు ఆధునిక యంత్రాలు, శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించడంలో ఈ మెగా రైతు మేళాలు ఎంతో తోడ్పడతాయన్నారు.

**స్టాళ్ల పరిశీలన - నాటు యంత్రాన్ని నడిపిన మంత్రి:**

ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ రైతులకు మంత్రి సీతక్క సన్మానం చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రదర్శన స్టాళ్లను సందర్శించారు. ఈ క్రమంలో మంత్రి సీతక్క స్వయంగా నూతన వరి నాటు యంత్రాన్ని నడిపి, దాని పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువగా మెరుగైన వైద్యం

### త్వరలో నూతన ఏరియా ఆసుపత్రి ప్రారంభం: ఎమ్మెల్యే రేవూరి

**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్ష**
**రికార్డుల నిర్వహణపై సూపరింటెండెంట్‌పై ఎమ్మెల్యే అసంతృప్తి**

**హనుమకొండ/పరకాల:**



పరకాలలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులతో త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం నూతన ఆసుపత్రి భవనంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్పర్సన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ నిధుల ద్వారా రూ.79.18 లక్షల వ్యయంతో వైద్య పరికరాల కొనుగోలు, అత్యవసర మందుల నిల్వలు, శస్త్రచికిత్స పరికరాల లభ్యతపై సుదీర్ఘంగా చర్చించారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే... వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్ పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రశీదు, రికార్డు పారదర్శకంగా ఉండాలని హెచ్చరించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ ముఖ్య ఆదేశాలు జారీ చేశారు. 24 గంటల వైద్య సేవలు ప్రజలకు నిరంతరం నాణ్యమైన వైద్యం అందాలి. వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. సిఎం దృష్టికి నూతన ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, వసతుల వివరాలను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనస్థీషియా వైద్యుడి నియామకంతో ఆసుపత్రిలో అనస్థీషియా వైద్యుడు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. మార్కెట్ భవనం పూర్తి చేయాలి, పరకాలలో అసంపూర్తిగా ఉన్న మార్కెట్ భవన సముదాయం పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సేవల నాణ్యత పెరగాలి, ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు, ప్రసవాల సంఖ్యను పెంచి, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. ఈ సమావేశంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, మున్సిపల్ కమిషనర్ పి. పవన్, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, కమిటీ సభ్యులు డాక్టర్ బాలకృష్ణ, నాగరాణి, రాఘవ రెడ్డి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రారంభానికి సిద్ధమైన కరీంనగర్ నూతన కలెక్టరేట్

**కరీంనగర్, జూన్ 11 (వుదయం ప్రతినిధి):**

**నెలాఖరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం**

**జిల్లా అభివృద్ధికి పరిపాలనా కేంద్ర బిందువుగా నూతన కలెక్టరేట్:**

**మంత్రి పొన్నం ప్రభాకర్**



కరీంనగర్ జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నూతన కలెక్టరేట్ భవనాన్ని ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మున్సిపల్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శాతవాహన విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్మితమైన నూతన కలెక్టరేట్ భవనాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిధ విభాగాలను సందర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ జిల్లా అభివృద్ధికి పరిపాలనా కేంద్ర బిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో ప్రారంభమైన కలెక్టరేట్ నిర్మాణ పనులు వివిధ కారణాలతో పూర్తికాక నిలిచిపోయాయని, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రత్యేక చొరవ తీసుకుని మిగిలిన పనులను వేగవంతం చేసి పూర్తిచేయించారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం సహకారంతో అన్ని ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక వసతులు, పౌరులకు అనుకూలమైన సేవా వ్యవస్థతో కూడిన కలెక్టరేట్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని వెల్లడించారు. సుడా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో విస్తృత స్థాయిలో గ్రీనరీ, ల్యాండ్‌స్కేపింగ్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. పర్యావరణ రహిత వాతావరణం, విశాలమైన కార్యాలయాలు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవా వ్యవస్థతో ఈ కలెక్టరేట్ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వ కార్యాలయ సముదాయంగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంలో నూతన కలెక్టరేట్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. జిల్లాను పరిశ్రమలు, పర్యాటకం, విద్య, వైద్య రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సహకారంతో కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, లా కాలేజీ, ఫార్మసీ కాలేజీ ఏర్పాటు ద్వారా ఉన్నత విద్యా అవకాశాలు విస్తరించాయని చెప్పారు. గతంలో నిలిచిపోయిన విద్యా అభివృద్ధి కార్యక్రమాలకు కొత్త ఊపునిస్తూ మరిన్ని కోర్సులు, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో కరీంనగర్‌ను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మెడికల్ కాలేజీని టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. నూతన మానేరు రివర్‌ఫ్రంట్ రెండోదశ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని, డంప్ యార్డు తరలింపునకు కేంద్ర ప్రభుత్వ సహకారం కోరినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, ఆర్డీవో షర్మిల, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు పురుగు మందులు విక్రయిస్తే జైలుకే..

### వ్యవసాయ అధికారి డా.నవ్య



**మంథని, జూన్ 11 (వుదయం ప్రతినిధి):**

మంథని మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి డా. నవ్య గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా విత్తనాల స్టాక్ రిజిస్టర్లు, నిల్వల వివరాలు, సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీలర్లకు సూచనలు చేస్తూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విత్తనాలు లేదా ఎరువులను నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, గతంలో కొంతమంది ఎరువుల షాప్ లో యజమానిలు రైతులకు నకిలీ విత్తనాలు పురుగు మందులు విక్రయించినట్లు సంఘటన గుర్తు చేసుకుని పాత ఎరువులను పెరిగిన ధరలకు అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొంతమంది రాజకీయ పలుకుబడి ఉపయోగించి తప్పుడు మార్గన వెళ్తానంటే సహించేది చేయలేదని హెచ్చరించారు. అనంతరం సూర్యపల్లి రైతు వేదికలో నిర్వహించిన "ఖేతీ బచావో" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త వెంకన్న హాజరై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయంపై మరింత దృష్టి సారించాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వ్యవసాయాభివృద్ధికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. "అన్నిటికీ మూలాధారం నేల. మనం నేలను కాపాడుకుంటే నేల మనల్ని కాపాడుతుంది" అని ఆయన అన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా నేల సారాన్ని పెంచడంతో పాటు పంటల దిగుబడులు, నాణ్యత కూడా మెరుగుపడుతాయని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

**పెద్దపల్లి, జూన్11 (వుదయం ప్రతినిధి)**

***రైతుల ఖాతాల్లో రూ.1,018 కోట్లు జమ**

***ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు**



ఈ రబీ సీజన్ లో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, రికార్డు స్థాయిలో ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోళ్లను పూర్తి చేసిందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందనడానికి ఈ కొనుగోళ్లే నిదర్శనమన్నారు. ఈ రబీ సీజన్ లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 334 కొనుగోలు కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో 4,29,921 మెట్రిక్ టన్నల వరి ధాన్యాన్ని విజయవంతంగా సేకరించామని, ఇందుకు గాను రైతులకు దాదాపు 1,018 కోట్ల 65 లక్షల రూపాయలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లించామని స్పష్టం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పెద్దపల్లి జిల్లాలో సుమారు 29వేల మెట్రిక్ టన్నల ధాన్యం అదనంగా సేకరించినట్లు వివరించిన ఆయన, మార్కెట్ యార్డుల ద్వారా సుమారు 25వేల మెట్రిక్ టన్నల మొక్కజొన్నను కూడా కొనుగోలు చేశామని తెలిపారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసినా, రంగు మారినా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుని, రైతుల వద్ద చివరి గింజ వరకు కొనుగోలు చేసిందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ ఉంచేందుకు పెద్దపల్లి నియోజకవర్గంలో 1.70 లక్షల మెట్రిక్ టన్నల సామర్థ్యం గల గోదాముల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. ఇందులో భాగంగా ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో గిడ్డంగుల సంస్థ ద్వారా 20వేల మెట్రిక్ టన్నల సామర్థ్యంతో గోదాము పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, సింగిల్ విండో ఆధ్వర్యంలో మరో 14వేల మెట్రిక్ టన్నల గోదాముకు భూమి కేటాయించామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఓదెల మండలంలో 20వేల మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్‌లో 2వేల మెట్రిక్ టన్నులు, పెద్దపల్లి మండలంలో 2వేల మెట్రిక్ టన్నల సామర్థ్యం గల గోదాముల నిర్మాణానికి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఎటువంటి ప్రకృతి విపత్తులు వచ్చినా రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యాన్ని భద్రపరుచుకోవడానికి ఈ గోదాములు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో విపక్షాల తీరుపై ప్రభుత్వ విప్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆ ర్ఎ స్, బీజేపీలు ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తూ రైతులను రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు. పెద్దపల్లి నియోజకవర్గానికి కాళేశ్వరం ప్రాజెక్టు నీటి వల్ల పంటలు పండలేదని, గతంలో జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ ల కాలంలో ప్రారంభమైన ఎస్ఆర్ఎస్పీ కెనాల్ నీటి ద్వారానే ఇక్కడి రైతులకు సాగునీరు అందిందని స్పష్టం చేస్తూ, కాళేశ్వరం ద్వారా ఏ ఊరికి నీళ్లొచ్చాయో సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో తీవ్ర లోపాలు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని, అందుకే బ్యారేజీలు కుంగిపోయాయని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్‌చైర్మన్ నూగిల్ల మల్లయ్య, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సారయ్య గౌడ్, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ పిల్లలకు 100% ఫీజు రాయితీ ఇవ్వాలి

### టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్, డీఈఓ లకు వినతి



**కామారెడ్డి, జూన్ 11 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలోని అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో 100% ఫీజు రాయితీ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ, జిల్లాలో 500 పైగా అర్హులైన జర్నలిస్టులు ఉన్నారు. వీరిలో పేద, మధ్యతరగతి కి చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. అందుకని వారి పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో 100% ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ జీవో ప్రకారం 100% రాయితీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కార్యాలయ సూపరిండెంట్ వరప్రసాద్, జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ లకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజేష్ , ఆబిద్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శ్రీనివాస్, జర్నలిస్టులు శివ, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, ముదాం శంకర్, వెంకటేశ్వర్లు, మాణిక్య శ్రీకాంత్, మధు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## చివరి దశ ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి..జిల్లా కలెక్టర్

**జగిత్యాల జూన్ 11 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో చివరి దశలో ఉన్న వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా బీర్ పూర్ మండల కేంద్రం నరసింహుల పల్లి గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా వేగంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం నిల్వ రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు అకాల వర్షాలు ఉన్నందున కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేసి వెను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు వర్షాలకు కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ తహసిల్దార్ ఎంపిడివో ఎంపివో సివిల్ సప్లై అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెంబి మండలం గ్రామాల అభివృద్ధికి చర్యలు: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా 11 జూన్ 2026 (వుదయం ప్రతినిధి)**



పెంబి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. ఇటిక్యాల తండా, కోలం గూడా, చాకిరేవు, గమ్మెన ఎంగ్లాపూర్, ధూందారి, చేర్యాల కడెం మండలంలోని మిద్దె చింతల, అల్లంపల్లి, ఇస్లాంపూర్, అడ్డాల తిమ్మాపూర్, తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉన్న అడ్డంకులు తొలగించేలా తగు చర్యలు తీసుకునేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గ్రామాలకు కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగు పరిచేలా రెవెన్యూ భూమిలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించేలా చొరవ చూపుతామని చెప్పారు. నాణ్యమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మెరుగైన రోడ్డు రవాణా కల్పించేందుకు అవసరమైన చోట ఐరన్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తొలిగించాలని చెప్పారు. ఆయా గ్రామాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వివరించారు. ఎఎన్ఎం, ఆశాలు స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. నిరంతరం పరిశుద్ధ్య పనులు కొనసాగించాలన్నారు. కోలం గూడాలో మొక్కలు నాటారు. అక్కడ నుంచి రోడ్డు సౌకర్యం లేని పలు గ్రామాలకు ఎమ్మెల్యే, కలెక్టర్లు అధికారులతో కలిసి బైక్ పై పలు గ్రామాలు తిరిగారు. గమ్మెన ఎంగ్లాపూర్ గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. టవర్ ఏర్పాటుకు స్థలాన్ని ఇచ్చిన గ్రామ రైతు చిన్నయ్యను అభినందించారు. స్థలాన్ని వెంటనే బిఎస్ఎన్ఎల్ కు అప్పగించి, పనులు ప్రారంభం చేయించి, గ్రామస్తులకు మొబైల్ సిగ్నల్స్ సమస్యలు తీరుస్తామన్నారు. రాళ్ళవాగు పై ఐరన్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

**అధికారుల సమన్వయంతో ప్రజల సమస్యలు దూరం చేయాలి: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

పెంబి, కడెం మండలాలలోని పలు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సమన్వయంతో వ్యవహరించి పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పెంబి, కడెం మండలాలలో ఇందిరమ్మ ఇండ్లు, రోడ్లు, వంతెనలు, సెల్ టవర్లు, తదితర మౌలిక సదుపాయాల కల్పన పనుల్లో అటవీ నిబంధనల కారణంగా ఆలస్యం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే పలుమార్లు సమస్యల పరిష్కారం పై అధికారులతో సమావేశాలు నిర్వహించడంతోపాటు, రెవెన్యూ శాఖ మంత్రి తో కూడా సమస్యల ప్రస్తావన జరిగిందని అన్నారు. త్వరలోనే మరోసారి మంత్రిని కలిసి, అటవీ అనుమతుల కారణంగా ఆగిపోయిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. అటవీ అధికారులు తమ పరిధిలో ఉన్న అంశాల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని వివరించారు. అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఇస్లాంపూర్ గ్రామంలో గ్రామపంచాయితీ, అంగన్వాడి భవనాలు ప్రారంభించారు. ఈ పర్యటన లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, డిఆర్డిఓ విజయలక్ష్మి , డిపివో శ్రీనివాస్, డిఎంహెచ్ఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు స్థానిక గ్రామాల ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్

**ఆదిలాబాదు, వుదయం:**



మావల మండల కేంద్రంలోని కేఆర్కే కాలనీలో లబ్ధిదారుల కేటాయింపుకు సిద్ధంగా ఉన్న రెండు పడక గదుల (డబుల్ బెడ్ రూమ్) ఇళ్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్లకు సంబంధించిన విద్యుత్, త్రాగునీరు, శానిటేషన్, ఇతర పెండింగ్ పనులన్నింటినీ వెంటనే త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ స్థానిక గాంధీ పార్క్‌ను సందర్శించి, పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. పార్క్‌లో నిర్మిస్తున్న 7 ఫామ్ పాండ్స్, 5 బోర్ వేల్ రీచార్జ్ స్ట్రక్చర్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. వీటితో పాటు పిల్లలను ఆకట్టుకునే చిల్డ్రన్ ట్రైన్, పార్క్‌లోని ఇతర మరమ్మతు పనులను అత్యంత వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీడీ రాజు, హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్ శ్రీనివాస్‌లతో పాటు ఇంజనీరింగ్, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## అటవీ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### –రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద




**మంచిర్యాల/జూన్ 11(వుదయం ప్రతినిధి)**

అటవీ ప్రాంతాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని చెన్నూర్ అటవీ రేంజ్ పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి, అటవీ డివిజన్ అధికారి, గ్రామాల సర్పంచ్ లు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం కొరకు అటవీ ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, ఈ ప్రాంతంలోని మొసళ్ళ పార్క్, ఇతర ప్రాంతాలను పర్యాటకుల కొరకు తీర్చిదిద్దాలని, తద్వారా పర్యాటక ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెంపొందుతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...అటవీ అభివృద్ధిలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, జిల్లాలో కమ్యూనిటీ ప్రాంతాలు, అటవీ ప్రాంతాలలో మొక్కలు నాటాలని తెలిపారు. జిల్లాలో మైనింగ్ ప్రాంతాలు అధికంగా ఉన్నాయని, వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు, కాలుష్యాన్ని నియంత్రించేందుకు, ప్రకృతిని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. అడవి పై ఆధారపడి జీవిస్తున్న ప్రజల రక్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా జంగల్ సఫారీలు ఏర్పాటు చేయడం జరిగిందని, బటర్ ఫ్లై పార్క్‌ను మరింత అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మందమర్రి పట్టణంలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో కొనసాగుతున్న జర్మన్ భాషా శిక్షణ తరగతులను ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్, అధికారులతో కలిసి సందర్శించి తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలోసంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో ఉండాలి.. వైద్యం అందించాలి: జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల, జూన్ 11:**

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల సుందరయ్య నగర్ లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్ సీ)లో జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ముందుగా ఓపీ, వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. ఏ ఎన్ సీ నమోదు, ఎన్ సీడీ స్క్రీనింగ్ టెస్టులపై ఆరా తీశారు. వ్యాక్సిన్ గది, మందులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రభుత్వ వైద్యశాలల్లోనే ప్రసవాలు, చికిత్స పొందేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని పేర్కొన్నారు. సబ్ సెంటర్ లలో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎన్ సీడీ స్క్రీనింగ్ టెస్టులు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

## దుబాయిలో మృతి చెందిన జనసైనికుడు తిరుపతికి జనసేన పార్టీ అండ

**జూన్ 11 మల్యాల మండలం ( వుదయం ప్రతినిధి )**

ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్ళ పల్లి గ్రామానికి చెందిన యువకుడు, జన సైనికుడు



గొల్లపల్లి తిరు పతి క్రొద్ది రోజుల క్రితం దుబాయ్ లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. ఈ సంఘటనతో తీవ్ర ఆవేదనకు గురి అయిన జగిత్యాల జిల్లా జనసైనికులు ఈ సంఘటన పై ఆరా తీసిన చొప్పదండి నియోజకవర్గ సీనియర్ జనసేన నాయకులు మొగిలిపాలెం రమేష్ వెంటనే సమాచారాన్ని పార్టీ అధిష్టాన R.K. సాగర్ మరియు గోకుల రవీందర్ రెడ్డి కి సమాచారాన్ని తెలియజేయగా దిగ్భ్రాంతి తెలియజేసి వెంటనే దుబాయ్ లోని ఇండియన్ ఎంబసీ వారిని సంప్రదించి మరియు దుబాయ్ లోని జనసేన నాయకులతో మాట్లాడి ఎంటువంటి ఆటంకాలు కలుగకుండా వీలు అయినంత త్వరగా మృతదేహాన్ని స్వస్థలానికి చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

## పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

**పెద్దపల్లి జూన్ 11 (వుదయం ప్రతినిధి)**

**-జిల్లా పరీక్షల,సైన్స్ అధికారి వి.హనుమంతు**

**-జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీల పోస్టర్ ఆవిష్కరణ**



విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన, బాధ్యతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ–విత్తనం నుండి వృద్ధి వరకు 2026 వాల్ పోస్టర్‌ను గురువారం పెద్దపల్లి బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఆవిష్కరించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ప్రత్యేక సమావేశంలో జిల్లా పరీక్షల, సైన్స్‌అధికారి వి.హనుమంతు ఈ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రకృతిపై ప్రేమను, పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏక్ పెడ్ మా కే నామ్ అనే అద్భుతమైన సందేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆశయాలకు అనుగుణంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షణ బాధ్యతను ఒక కర్తవ్యంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్ మాట్లాడుతూ నేడు నాటే చిన్న మొక్కే రేపటి భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని, ప్రతి పాఠశాల ఒక పచ్చని ఉద్యానవనంగా మారాలన్నదే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మండల విద్యాధికారి టి.సురేంద్ర కుమార్, మండల విద్యాశాఖ అధికారులు డి.లక్ష్మణ్, ఐ.విజయ్ కుమార్ తోపాటు వివిధ స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## పనీర్‌లోని ప్రొటీన్ తరిగిపోకుండా.. వండేదెలా?



పనీర్ చాలామంది ఇష్టపడే పదార్థం. అందుకే దీంతో బటర్ మసాలా, టిక్కా, బుర్జీ.. వంటి ప్రత్యేక వంటకాలు తయారుచేసుకొని దీని రుచిని ఆస్వాదిస్తుంటారు. అయితే ఇలా రుచే కాదు.. ఇందులో ఎక్కువ మొత్తంలో ఉండే ప్రొటీన్లు శరీరానికి అందడం కూడా ముఖ్యమే! కానీ కొన్ని పద్ధతుల్లో దీన్ని వండడం వల్ల అందులోని ప్రొటీన్లు పూర్తిగా శరీరానికి అందవంటున్నారు నిపుణులు. అందుకే ఈ పోషక విలువలు కోల్పోకుండా ఉండాలంటే వండుకునే క్రమంలో, ఆహారంగా తీసుకునేటప్పుడు కొన్ని చిట్కాలు పాటించాలని సూచిస్తున్నారు. పనీర్ సహజంగానే మృదువుగా ఉంటుంది. కొన్ని నిమిషాల్లోనే ఇది ఉడికిపోతుంది. అలాకాకుండా కొంతమంది పనీర్ ముక్కలు క్రిస్పీగా ఉండాలని, బంగారు వర్ణంలోకి మారాలని ఎక్కువసేపు అధిక మంటపై ఉడికిస్తారు.. మరికొంతమంది నూనెలో డీప్ ఫ్రై చేస్తారు. ఈ రెండు పద్ధతులు సరికాదంటున్నారు నిపుణులు. ఇలా అధిక వేడిపై వండడం వల్ల పనీర్‌లోని ప్రొటీన్ నిర్మాణం దృఢంగా బిగుసుకుపోతుందట. ఫలితంగా ఈ ప్రొటీన్ జీర్ణం కాక, శరీరానికి అందక వృథా అయిపోతుందని చెబుతున్నారు. అందుకే మీడియం లేదా తక్కువ మంటపై ఉంచి కొన్ని నిమిషాల పాటు సాటింగ్ పద్ధతిలో పనీర్‌ని ఉడికించుకుంటే.. అది మరింత మృదువుగా మారి వంటకం రుచిస్తుందని, ప్రొటీన్ కూడా పూర్తి స్థాయిలో శరీరానికి అందుతుందని సలహా ఇస్తున్నారు. అందుకే చెఫ్‌లు ఏ వంటకంలోనైనా దీన్ని ఆఖర్లో జత చేస్తారని అంటున్నారు. రెస్టరంట్ స్టైల్‌లో కొన్ని రకాల వంటకాల్ని తయారుచేస్తుంటారు కొందరు. ఈ క్రమంలోనే పనీర్‌ని నూనెలో డీప్‌ఫ్రై చేసి బటర్ పనీర్, పనీర్ మసాలా.. వంటి రెసిపీస్‌లో జత చేస్తుంటారు. దీనివల్ల వంటకం రుచి పెరుగుతుందేమో కానీ పనీర్‌లోని పోషకాలు తరిగిపోయే అవకాశాలే ఎక్కువంటున్నారు నిపుణులు. అలాగే నూనెలోని అధిక కొవ్వులు త్వరగా జీర్ణం కాక జీర్ణ సంబంధిత సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంటుందంటున్నారు. అందుకే ఇలాంటి డీప్ ఫ్రై చేసిన పదార్థాల్ని తక్కువ మొత్తంలో తీసుకోవడంతో పాటు వీటిలో జతచేసే పనీర్‌ని నూనెలో వేయించకుండా.. సాటింగ్, ఎయిర్ ఫ్రై పద్ధతుల్లో కొన్ని నిమిషాల పాటు వేయించి ఆయా వంటకాల్లో కలుపుకోవడం మంచిదంటున్నారు. వండే ముందు కాయగూరలు, వాటి ముక్కల్ని కడిగినట్లే.. పనీర్‌ని కూడా కడుగుతుంటారు కొందరు. మరికొందరు బాగా సాఫ్ట్‌గా మారాలని బేకింగ్ సోడా నీటిలో వేస్తుంటారు. ఈ రెండు పద్ధతులు సరికావంటున్నారు నిపుణులు. ఎందుకంటే పనీర్‌లో ప్రొటీన్‌తో పాటు నీటిలో కరిగే కొన్ని పోషకాలుంటాయట. ఎక్కువసేపు కడగడం వల్ల అవి తరిగిపోయే అవకాశం ఉంటుందంటున్నారు. కాబట్టి పనీర్ ముక్కల్ని నీటిలో అలా వేసి ఇలా తీస్తే సరిపోతుందంటున్నారు. ఒకవేళ పనీర్ కాస్త గట్టిగా ఉందనిపిస్తే.. గోరువెచ్చటి నీటిలో నిమిషం పాటు ఉంచి తీస్తే.. అది తాజా గా, మృదువుగా మారుతుందని చెబుతున్నారు. రెస్టరంట్‌కి వెళ్లినప్పుడు బటర్ నాన్–పనీర్ బటర్ మసాలా.. ఈ ఫుడ్ కాంబినేషన్ ఆర్డర్ చేయనిదే చాలామంది భోజనం పూర్తి కాదు. నిజానికి ఈ రెండూ కలిపి తీసుకోవడం ఆరోగ్యకరం కాదంటున్నారు నిపుణులు. పనీర్‌లో ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది.. ఇక మైదాతో తయారుచేసిన నాన్.. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న పదార్థం. ఈ రెండూ కలిసినప్పుడు రక్తంలో చక్కెర స్థాయులు పెరిగిపోవడం, అజీర్తి, కడుపుబ్బరం.. వంటి సమస్యలొస్తాయట. అందుకే ఈ ఫుడ్ కాంబినేషన్ తీసుకోకపోవడమే మేలంటున్నారు నిపు ణులు. కావాలంటే పనీర్ బటర్ మసాలా–జొన్న రొట్టె కాంబినేషన్ తీసుకోవడం మంచిదంటున్నారు.

## చర్మ సంరక్షణ కోసం..!

సౌందర్య పరిరక్షణలో అత్యవసర నూనెల పాత్ర కీలకం. పెప్పర్‌మింట్ నూనె కూడా ఇందుకు మినహాయింపు కాదు. మొటిమలు, చర్మం నిర్జీవంగా మారడం, పొడిబారిపోవడం.. వంటి పలు సౌందర్య సమస్యలకు దీని ద్వారా పరిష్కారం పొందచ్చంటున్నారు నిపుణులు. ఇందుకోసం ఈ నూనెను ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం..!



గిన్నెలో రెండు కప్పుల పంచదార, పావుకప్పు బాదం నూనె, టీ స్పూన్ పెప్పర్‌మింట్ నూనె వేసి బాగా కలుపుకోవాలి. ఒకవేళ ఈ మిశ్రమం మరీ జారుడుగా ఉన్నట్లు కనిపిస్తే ఇంకాస్త పంచదార వేసి కలుపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో భద్రపరచుకొని నెల రోజుల పాటు ఉపయోగించుకోవచ్చు. రోజూ స్నానం చేయడానికి ముందు ఈ మిశ్రమంతో శరీరాన్ని మర్దన చేసుకున్నట్లయితే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. గిన్నెలో మూడు టేబుల్‌స్పూన్ల ఉప్పు, రెండు చెంచాల ఆలివ్ నూనె, నాలుగు చుక్కల పెప్పర్‌మింట్ ఆయిల్ వేసి బాగా కలుపుకోవాలి. దీంతో ముఖం, మెడను మృదువుగా, గుండ్రంగా రుద్దుకొని శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమం స్క్రబ్‌లా పనిచేసి చర్మంపై చేరిన మురికి, మృత కణాలను తొలగిస్తుందట. ఫలితంగా చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుందట. విటమిన్ 'ఇ' నూనె, జొజోబా ఆయిల్‌ను సమపాళ్లలో తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. దీనికి కొన్ని చుక్కల పెప్పర్‌మింట్ నూనెను కూడా కలపాలి. మొటిమలు ఎక్కువగా ఉన్న వారు ఈ మిశ్రమాన్ని రోజూ రాత్రి నిద్రపోయే ముందు రాయడం ద్వారా.. అవి తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. రెండు చెంచాల కీరాదోస తురుము, టీస్పూన్ పెప్పర్‌మెంట్ ఆయిల్ తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. దీనిలో రెండు టీస్పూన్ల గ్రీన్ క్లే (ఇది సూపర్ మార్కెట్లలో, ఆన్‌లైన్ స్టోర్స్‌లో లభిస్తుంది)ను కూడా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్‌లా వేసుకొని పూర్తిగా ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే చర్మం తాజాగా మారుతుందని చెబుతున్నారు నిపుణులు.

## గుడ్డిగా నమ్మేయకండి!

సోషల్‌మీడియా తెరిస్తే చాలు... ఎన్నెన్ని బ్యూటీ ట్రెండ్స్ వెల్లువెత్తుతాయో! ఇన్‌ఫ్లుయెన్సర్లు, హీరోయిన్లు చెప్పడం ఆలస్యం పాటించేస్తున్నారు. ఇవి చాలవన్నట్లు ఆకర్షించే ఇతర దేశాల అందాల చికిత్సలు. దీంతో ఏవేవో క్రీములు, డీఐవై ట్రీట్‌మెంట్లు... ప్రయత్నిస్తున్నవి ఎన్నని? కానీ ఇవి నిజంగా మేలు చేస్తాయా లేదా అని ఎప్పుడైనా ఆలోచించారా? వీటిలో చాలావరకూ డాక్టర్లు, స్కిన్‌కేర్ నిపుణులు పరీక్షించనివే.



అవి మేలు చేయకపోగా యాక్నే, అలర్జీలకు కారణమైతే? చర్మానికి తీవ్ర హాని చేస్తే? అవతలివాళ్లు చెప్పింది నిజమే అయ్యుండొచ్చు. ఒక ఉత్పత్తి, చిట్కా వాళ్లకి బాగా పనిచేసి ఉండొచ్చు. అయితే అది మీకూ ఆ విధంగానే మేలు చేయాలనేం లేదుగా? అయినా ఈ వైరల్ వీడియోలనే చూడండి. బాగా పనిచేశాయని చెబుతారు. తరవాత సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయో లేదో చెప్పేదెవరు? ఫొటోలు ఎడిట్ చేసుండొచ్చు, ఫిల్టర్ వాడి తీసుకునీ ఉండొచ్చు. ప్రమోటింగ్‌లో భాగంగానూ చెప్పి ఉండొచ్చు. కాబట్టి, ఎవరో చెప్పారని గుడ్డిగా నమ్మేయకండి. వాళ్లని అనుసరించకండి. మీకు

## గ్లోకేషన్ ట్రెండ్ గురించి తెలుసా!

అమ్మాయిలు... వీకెండ్ వస్తే ఫ్రెండ్స్‌తో కలిసి షాపింగ్‌లు, సినిమాలు, రెస్టరంట్‌ల చుట్టూ తిరిగే రోజులు పోయాయి. ఇప్పుడు రూటు మార్చి కొత్తగా 'గ్లోకేషన్' ట్రెండ్‌కే ఓటేస్తున్నారు. ఈ గ్లోకేషన్ ఏంటి అనుకుంటున్నారా? సెలవుల్లో సరదాగా నచ్చిన ప్రాంతాన్ని చూడ్డానికి వెళితే... గ్లోకేషన్‌లో చర్మ సౌందర్యం, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి స్పాలకు వెళుతున్నారట. రోజూవారీ చదువులు, ఆఫీస్ ఒత్తిళ్లు, ప్రయాణాల వల్ల కాలుష్యం... వీటన్నింటి వల్ల కోల్పోయిన చర్మ సౌందర్యాన్ని తిరిగి తెచ్చుకోవడానికి గ్లోకేషన్లకి వెళుతున్నారట. అందుకే వీకెండ్ వచ్చిందంటే చాలు జెన్ జీ అమ్మాయిలు దగ్గర్లో ఉండే నేచురోపతి రిసార్ట్స్, ఎండ తక్కువగా ఉండే



టూరిస్ట్ స్పాట్‌లను వెతికేస్తున్నారట. అక్కడ రసాయనాలకు దూరంగా పురాతన పద్ధతిలో ఆర్గానిక్ స్పా, ఫ్రూట్ ఫేషియల్, మడ్ థెరపీ లాంటి బాడీ డీటాక్స్ థెరపీలను చేయించుకుంటున్నారు. అంతేకాదు, తాజా పండ్లు కూరగాయలతో పండ్ల రసాలు, సలాడ్స్ వంటి సాత్వికాహారం తీసుకుంటూ బాడీని డీటాక్స్ చేసుకుంటున్నారు కూడా. ధ్యానం, యోగా చేస్తూ ఇటు మనసునీ... అటు చర్మాన్నీ రీఫ్రెష్ చేసుకుంటున్నారు జెన్ జీ అమ్మాయిలు. అంతేకాదు, 'ఈ ఉరుకులు పరుగుల జీవితంలో మనకంటూ కొంత సమయం కేటాయించుకోవాలి అప్పుడే ఆరోగ్యంగా ఉండేది. అంతేకాదు, చేసే పనిలో ఉత్పాదకత పెరుగుతుంది' అంటూ సోషల్ మీడియాలోనూ పంచుకుంటున్నారు.

## నిరంతరంగా అలసటగా అనిపిస్తుందా..

అలసట, జుట్టు రాలడం వంటి సమస్యలను చాలామంది సాధారణంగా ఒత్తిడి, నిద్రలేమి లేదా జీవనశైలి కారణాలుగా భావిస్తుంటారు. అయితే ఈ లక్షణాలు కొన్ని సందర్భాల్లో థైరాయిడ్ గ్రంథి పనితీరులో లోపాలకు కూడా సంకేతాలుగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో జీవక్రియలు, శక్తి ఉత్పత్తి, జుట్టు పెరుగుదల, మానసిక స్థితి వంటి అనేక కీలక ప్రక్రియలను నియంత్రించడంలో థైరాయిడ్ హార్మోన్లు ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఈ హార్మోన్లలో అసమతుల్యత ఏర్పడితే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. మన దేశంలో ముఖ్యంగా మహిళల్లో థైరాయిడ్ సమస్యలు అధికంగా కనిపిస్తున్నప్పటికీ, చాలా సందర్భాల్లో అవి నిర్ధారణ కాకుండానే మిగిలిపోతున్నాయి. థైరాయిడ్ వ్యాధులు నెమ్మదిగా అభి వృద్ధి చెందడం వల్ల ప్రారంభ లక్షణాలను చాలామంది పట్టించుకోరు. అందువల్ల ప్రతి సంవత్సరం ఆరోగ్య పరీక్షల్లో భాగంగా థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవడం మంచిది. థైరా యిడ్ సమస్యలకు సంబంధించిన ప్రధాన లక్షణాల్లో నిరంతర అలసట ఒక టి. రాత్రి ఎనిమిది గంటలకు పైగా నిద్రపోయినా రోజంతా నీరసంగా, శక్తిలేనట్టుగా అనిపిస్తే అది థైరాయిడ్ పనితీరులో లోపా నికి సంకేతం అయి ఉంటుంది. ముఖ్యంగా హైపోథైరాయిడిజం ఉన్నప్పుడు శరీర జీవక్రియలు మందగించి శక్తి ఉత్పత్తి తగ్గిపోతుంది. ఫలి తంగా అలసట, బద్ధకం ఎక్కువగా కనిపిస్తాయి. జుట్టు రాలడం లేదా జుట్టు పలచబడడం కూడా మరో ముఖ్యమైన హెచ్చరిక సంకేతం. సాధారణంగా ప్రతి ఒక్కరికీ కొంతమేర జుట్టు రాలడం సహజమే. అయితే జుట్టు అసాధారణంగా రాలడం, పొడిగా మారడం, పెళుసు గా తయారవడం వంటి మార్పులు కనిపిస్తే థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవడం అవసరం. థైరాయిడ్ హార్మోన్లు జుట్టు పెరుగుదల చక్రాన్ని ప్రభావితం చేయడంతో ఈ మార్పులు చోటుచేసుకుంటాయి.



ఆహారపు అలవాట్లలో పెద్దగా మార్పులు లేకపోయినా అకస్మాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గిపోవడం కూడా థైరాయిడ్ సమస్యలకు సంకేతంగా ఉంటుంది. హైపోథైరాయిడిజం ఉన్నవారిలో జీవక్రియలు మందగించడం వల్ల బరువు పెరిగే అవకాశం ఉంటుంది. మరోవైపు హైపర్‌థైరాయిడిజం ఉన్న వారిలో జీవక్రియలు వేగవంతమై బరువు తగ్గుతారు. చర్మం పొడిబారడం, గోర్లు బలహీనపడటం వంటి లక్షణాలు కూడా థైరాయిడ్ అసమతుల్యతతో సంబంధం కలిగి ఉంటాయి. శరీర కణాల పునరుత్పత్తి ప్రక్రియ మందగించడం వల్ల చర్మం తేమ కోల్పోయి పొడిబారుతుంది. అదే సమయంలో గోర్లు బలహీనంగా మారి సులభంగా విరిగే అవకాశం ఉంటుంది. మానసిక స్థితిలో మార్పులు, ఏకాగ్రత లోపం, జ్ఞాపకశక్తి మందగించడం లేదా నిరాశ వంటి లక్షణాలు కూడా థైరాయిడ్ సమస్యలతో ముడిపడి ఉంటాయి. థైరాయిడ్ హార్మోన్లు మెదడు పనితీరుపై ప్రభావం చూపుతాయి. అందువల్ల చిరాకు, మూడ్ స్వింగ్స్, ఆలోచనల్లో మందగింపు వంటి సమస్యలు కనిపిస్తాయి. అలసట, జుట్టు రాలడం థైరాయిడ్ లోపాలకు సంబంధించిన తొలి సంకేతాల్లో ముఖ్యమైనవి.

## ఏయే పాలను ఎవరు తాగాలి..

పాలు చాలా కాలంగా సంపూర్ణ పోషకాహారంగా గుర్తింపు పొందాయి. ఎముకలను బలంగా ఉంచడం నుంచి శరీర ఎదుగుదలకు తోడ్పడడం వరకు పాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ప్రస్తుతం మార్కెట్లో ఆవు పాలు, మేక పాలు, సోయా, బాదం, కొబ్బరి పాలు వంటి అనేక ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి రకమైన పాలకు ప్రత్యేకమైన పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.



ముఖ్యంగా అనారోగ్యం, గాయాలు లేదా శస్త్రచికిత్స తర్వాత కోలుకునే సమయంలో సరైన పాల ఎంపిక శరీర పునరుద్ధరణకు ఉపయోగపడుతుంది. శరీర కణజాలాల మరమ్మత్తు, కండరాల పునర్నిర్మాణం, ఎముకలను బలపరిచే ప్రక్రియలకు అవసరమైన అన్ని ముఖ్యమైన అమినో ఆమ్లాలను సహజంగా అందించే పానీయాలలో పాలకు ప్రత్యేక స్థానం ఉంది. అందువల్ల ఆరోగ్య పునరుద్ధరణ సమయంలో పాల వినియోగాన్ని ప్రయోజనకరంగా భావిస్తారు. ఆవు పాలను సమతుల్య పోషకాల నిలయంగా పరిగణిస్తారు. ఒక గ్లాసు ఆవు పాలలో అధిక నాణ్యత కలిగిన ప్రొటీన్‌తో పాటు కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం, విటమిన్ బి12 వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా ఇందులో ఉండే వెయ్, కేసిన్ ప్రొటీన్లు కండరాల నిర్మాణం, వ్యాయామం తర్వాత శరీర పునరుద్ధరణలో సహాయపడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఎముక విరుగుడు, లిగమెంట్ గాయాలు లేదా కీళ్ల శస్త్రచికిత్స తర్వాత కోలుకుంటున్నవారికి ఆవు పాలను మంచి పోషక ఎంపికగా పరిగణిస్తారు. మేక పాలు కూడా పోషక విలువల పరంగా ఆవు పాలకు దగ్గరగా ఉంటాయి. కొంతమందికి ఆవు పాలు తాగిన తర్వాత జీర్ణ సమస్యలు ఎదురవుతుంటాయి. అలాంటి వారికి మేక పాలు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయి. ఇందులో ఉండే కొవ్వు కణాలు చిన్నవిగా ఉండటం, ప్రొటీన్ నిర్మాణం కొంత భిన్నంగా ఉండ టం వల్ల కొందరికి ఇవి సులభంగా జీర్ణమవుతాయి. అలాగే కాల్షియం, ఫాస్పరస్ కూడా తగిన మోతాదులో ఉండటంతో ఎముకల ఆరోగ్యానికి తోడ్పడతాయి. పాల ఉత్పత్తులు తీసుకోని వారు లేదా లాక్టోస్ అసహనం ఉన్నవారికి సోయా పాలను ఉత్తమమైన వృక్ష ఆధారిత ప్రత్యామ్నాయంగా పరిగణిస్తున్నారు. ఇతర ప్లాంట్–బేస్డ్ పాలతో పోలిస్తే సోయా పాలలో ప్రొటీన్ పరిమాణం ఎక్కువగా ఉంటుంది. కాల్షియం, విటమిన్ డి వంటి పోషకాలతో బలపరిచిన సోయా పాలు, పోషక విలువల పరంగా సాధారణ పాలకు దగ్గరగా ఉంటాయి. అందువల్ల శస్త్రచికిత్స లేదా గాయాల తర్వాత కోలుకునే సమయంలో కూడా ఇవి ఉపయోగకరంగా ఉంటాయి. బాదం పాలు ప్రస్తుతం విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నప్పటికీ, వాటిలో ప్రొటీన్ పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. సాధారణంగా ఒక గ్లాసు బాదం పాలలో ఒక గ్రాము లేదా అంతకంటే తక్కువ ప్రొటీన్ మాత్రమే ఉంటుంది. కాల్షియం, విటమిన్ డి కలిపిన బాదం పాలు ఎముకల ఆరోగ్యానికి కొంతమేర ఉపయోగపడినా, కండరాల నిర్మాణం లేదా కణజాలాల పునరుద్ధరణ కోసం ప్రధాన పోషక వనరుగా వీటిపై ఆధారపడటం సరైంది కాదు. వీటిని ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. కొబ్బరి పాలు కూడా రుచి కారణంగా, ముఖ్యంగా ప్లాంట్–బేస్డ్ డైట్‌ను అనుసరించే వారిలో ప్రాచుర్యం పొందుతున్నాయి. అయితే శరీర పునరుద్ధరణ దృష్ట్యా చూస్తే వీటిలో ప్రొటీన్ పరిమాణం తక్కువగా ఉంటుంది. కణజాలాల మరమ్మత్తుకు అవసరమైన అమినో ఆమ్లాల సమతుల్యత కూడా పరిమితంగానే ఉంటుంది.

## న్యూస్‌పేపర్లో ఫుడ్ ప్యాకింగ్.. ఎంత ప్రమాదకరమో?

చాట్ బండి వద్దకు వెళ్లి.. సమోసా, కచోరీ, వడాపావ్.. ఇలా ఏది పార్శిల్ కట్టమన్నా, సర్వ్ చేయమన్నా వాటిని న్యూస్ పేపర్లలో ఇవ్వడం చూస్తుంటాం. అంతెందుకు.. మన ఇంట్లో తయారుచేసుకునే పూరీలపై నుంచి అదనపు నూనెను తొలగించాలన్నా వాడేది న్యూస్ పేపరే. ఇక పొడి ఆహార పదార్థాల్ని న్యూస్ పేపర్లోనే చుట్టి పట్టుకెళ్లడం మనలో చాలామందికి అలవాటే! ఇలా ఆహార ప్యాకింగ్ అనగానే ముందుగా గుర్తొచ్చేది వార్తాపత్రికలే. కానీ ఈ అలవాటును పూర్తిగా మానుకోమని హెచ్చరిస్తోంది 'భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (FSSAI)'. ముంబయిలోని వీధి వ్యాపారులు ఫుడ్ ప్యాకింగ్ కోసం వార్తా పత్రికల్ని ఎక్కువగా వాడుతున్ననేపథ్యంలో.. వీటిపై వినియోగదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ప్యాకింగ్ కోసం పేపర్ ఉపయోగించడంపై తాజాగా నిషేధం విధించిందీ సంస్థ. ఈ తరహా ప్యాకింగ్ వల్ల ఆరోగ్యానికి నష్టం వాటిల్లడమే ఇందుకు కారణమని పేర్కొంది. మరి, ఇంతకీ ఆహారాన్ని న్యూస్ పేపర్‌లో చుట్టడం వల్ల ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలొస్తాయి? దీనికి ప్రత్యామ్నాయ మార్గాలేవైనా ఉన్నాయా? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం రండి.. 'ఫ్రై చేసిన ఆహార పదార్థాలు, నూనె పదార్థాల్ని న్యూస్ పేపర్లలో చుట్టడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఈ వార్తా పత్రికల ప్రింటింగ్ ఇంక్‌లో విషపూరిత రసాయనాలు, లెడ్/క్రోమియం/కాడ్మియం.. వంటి లోహాలు మిళితమై ఉంటాయి. వేడి పదార్థాలు, నూనె పదార్థాలు ఈ ఇంక్‌తో కలవడం వల్ల ఆయా రసాయనాలు ఆహారంలోకి విడుదలవుతాయి.. ఇలా కలుషితమైన ఆహారాన్ని తినడం ప్రమాదకరం..' అన్న సందేశంతో కూడిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిందీ ఆహార భద్రతా సంస్థ. ఈ క్రమంలో ఈ విధంగా ప్యాక్ చేసిన ఆహార పదార్థాల్ని తీసుకోవడం వల్ల వివిధ రకాల ఆరోగ్య సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. న్యూస్‌పేపర్ ఇంక్‌లో ఉండే హానికారక రసాయనాలు, రంగులు హార్మోన్ల పనితీరును దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. ఫలితంగా నెలసరి అదుపు తప్పడం, పీఎంఓఎస్, సంతానలేమి, చిన్న వయసులోనే రజస్వల కావడం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. గర్భిణులు ఈ తరహా ప్యాకింగ్ ఆహారం తీసుకుంటే.. పుట్టబోయే బిడ్డలో అవకరాలు, నెలలు నిండకముందే ప్రసవం కావడం, శిశువులు తక్కువ బరువుతో జన్మించడం.. వంటి సమస్యలొచ్చే ప్రమాదం ఉందంటున్నారు. న్యూస్‌పేపర్లలో ప్యాక్ చేసిన ఆహార పదార్థాల్ని తరచుగా తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో.. రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు పొంచి ఉందంటున్నారు నిపుణులు. వార్తా పత్రికలు ఎంతోమంది చేతులు మారుతుంటాయి. అపరిశుభ్రమైన ఉపరితలం పైనా వీటిని పడేస్తుంటారు. ఇలాంటి పేపర్లను ఫుడ్ ప్యాకేజింగ్ కోసం వాడితే.. వాటిపై ఉండే బ్యాక్టీరియా ఆహారంలోకి చేరుతుంది. ఇది ఫుడ్ పాయిజనింగ్‌కి దారితీసే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. న్యూస్‌పేపర్ల ఇంక్‌లోని హానికారక రసాయనాలు, కృత్రిమ రంగులు రోగనిరోధక వ్యవస్థ పనితీరునూ దెబ్బతీస్తాయని చెబుతున్నారు నిపుణులు. ఫలితంగా వివిధ రకాల ఇన్ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉంటుందంటున్నారు. ఈ అలవాటు అటు నాడీ వ్యవస్థ, ఇటు మూత్ర పిండాల పనితీరు పైనా ప్రతికూల ప్రభావం చూపుతుందట! ఫుడ్ ప్యాకింగ్, ర్యాపింగ్ కోసం వార్తా పత్రికల్ని వాడి లేని ఆరోగ్య సమస్యల్ని కొని తెచ్చుకోవడం కంటే.. దీని కోసం కొన్ని ప్రత్యామ్నాయాల్ని పాటించడం మేలంటున్నారు నిపుణులు. అరటి, అరేకా పామ్.. వంటి ఆకులతో తయారుచేసిన పర్యావరణహితమైన ఉత్పత్తులను ప్యాకింగ్ కోసం ఉపయోగించచ్చు. ఇవి సురక్షితమైనవని, వేడి పదార్థాల్ని వీటిలో ప్యాక్ చేసినా సమస్య ఉండదంటున్నారు. నూనె, తడి ఆహార పదార్థాల కోసం బటర్ పేపర్, ఫుడ్ గ్రేడ్ ర్యాపింగ్ పేపర్.. వంటివి మార్కెట్లో దొరుకుతాయి. వాటిని ఉపయోగించచ్చు. ఇక పొడి పదార్థాల కోసం బ్రౌన్ క్రాఫ్ట్ పేపర్ మేలంటున్నారు.



## ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్.. మరింత కాస్ట్లీ!



యాపిల్ తయారు చేసే ఐఫోన్లకు ఉండే క్రేజే వేరు. కొత్త ఐఫోన్ వస్తుందంటే చాలు కొన్ని రోజుల ముందే ఆరా తీస్తుంటారు. కొత్తగా మార్కెట్‌లోకి వస్తే క్యూ కట్టి మరీ కొనేస్తారు. యాపిల్ గతేడాది తెచ్చిన ఐఫోన్ 17 సిరీస్‌కూ మంచి స్పందన లభించింది. మరీ ముఖ్యంగా నారింజ రంగులో తీసుకొచ్చిన ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ ఓ దశలో బుకింగ్‌లూ నిలిపివేయాల్సి వచ్చింది. ఈ ఏడాది 18 ప్రో మ్యాక్స్ రాబోతోంది. ఈ మొబైల్ కోసం ఎదురుచూస్తున్న యాపిల్ ప్రియులకు షాక్. ఐఫోన్ 17 ప్రో మాక్స్‌తో పోలిస్తే 18 ప్రో మాక్స్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈసారి ప్రో మ్యాక్స్‌లో ఆ స్థాయిలో అప్‌గ్రేడ్‌లు ఉండటం, ఉత్పత్తి ఖర్చులు పెరిగిన నేపథ్యంలో యాపిల్ భారీ స్థాయిలో దీని ధరలు పెంచనున్నట్లు టెక్ నిపుణులు చెబుతున్నారు.




# దిగివస్తున్న బంగారం - వెండి ధరలు




బంగారం, వెండి ధరల్లో బుధవారం ఒక్కసారిగా కుదుపు ఏర్పడింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర 150 డాలర్లు తగ్గి 4110 డాలర్లకు చేరడంతో.. హైదరాబాద్ బులియన్ విపణిలో బుధవారం రాత్రి 11.30 గంటల సమయానికి 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,50,400కు చేరింది. కిలో వెండి ధర రూ.2,42,000కు దిగి వచ్చింది. మంగళవారం 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,900, కిలో వెండి ధర రూ.2,51,480 కావడం గమనార్హం. అంటే 10 గ్రాముల బంగారం ధర రూ.6,000కు పైగా, కిలో వెండి ధర రూ.9,500 తగ్గింది. ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నందున, సమీపకాలంలో బంగారం, వెండి ధరలు మరికొంత తగ్గే వీలుందని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధర మళ్లీ పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం.. అధిక ద్రవ్యోల్బణంలోనూ ఉద్యోగ నియామకాలు అంచనాలకు మించడంతో అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గవనే భావనలు పెరిగాయి. ఫలితంగా అంతర్జాతీయ విపణిలో బంగారం ధరలు 11 వారాల కనిష్ఠస్థాయికి చేరాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మార్చిలో ఔన్సు బంగారం ధర 5400 డాలర్లు కాగా, ఇప్పటికి 1400 డాలర్లు క్షీణించింది. డాలర్ బలోపేతం అయితే, ఇతర కరెన్సీలు వినియోగించే వారికి బంగారం కొనడం భారంగా మారుతుంది. ముడిచమురు ధర పెరిగినప్పుడూ, పసిడిపైకి పెట్టుబడులు తగ్గుతుంటాయి.

# గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచీ పెట్టుబడులు వెనక్కి

దేశీయ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ మేలో కాస్త నెమ్మదించింది. అంతర్జాతీయ అనిశ్చితి, ముడి చమురు ధరల పెరుగుదల, స్టాక్‌మార్కెట్ అస్థిరత నేపథ్యంలో, గత నెలలో ఈక్విటీ ఫండ్లలోకి నికర పెట్టుబడులు ఏడాది కాలంలోనే కనిష్ఠమైన రూ.22,908 కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్ నెలలో వచ్చిన రూ.38,440 కోట్లతో పోలిస్తే ఇవి 40% తక్కువ. గత 13 నెలలుగా వరుసగా పెట్టుబడులను ఆకర్షిస్తున్న పసిడి ఈటీఎఫ్‌ల నుంచీ మే నెలలో రూ.725 కోట్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయని భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) వెల్లడించిన గణాంకాలు



వెల్లడించాయి. ఈ నివేదిక ప్రకారం.. పరిశ్రమ నిర్వహణలోని నికర ఆస్తుల విలువ మే ఆఖరుకు రూ.81,58,341.65 కోట్లుగా ఉంది. ఏప్రిల్ చివరిలో ఈ మొత్తం రూ.81,92,387.69 కోట్లు. అయితే మదుపరుల భాగస్వామ్యం పెరుగుతోంది. మొత్తం పోర్ట్‌ఫోలియోల సంఖ్య 27.65 కోట్లకు చేరింది. మేలో 12.56 లక్షల కొత్త ఫోలియోలు జతయ్యాయి. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో మేలో రూ.30,953.83 కోట్లు వచ్చాయి. ఏప్రిల్‌లో ఈ మొత్తం రూ.31,115 కోట్లుగా ఉంది. సిప్ ద్వారా నిర్వహిస్తున్న ఆస్తుల విలువ రూ.17.12 లక్షల కోట్లకు చేరి, మొత్తం పరిశ్రమ ఆస్తుల్లో 21 శాతంగా ఉంది. గత నెలలో సిప్ ఖాతాల సంఖ్య 9.64 కోట్లుగా నమోదైంది. పసిడి ఈటీఎఫ్‌ల నుంచి 2025 ఏప్రిల్ తర్వాత తొలిసారిగా రూ.725 కోట్ల పెట్టుబడులు నికరంగా వెనక్కి వెళ్లాయి. బంగారం ధరలు మళ్లీ పెరిగినందున, మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, ప్రభుత్వం బంగారం కొనుగోళ్లపై చేసిన విజ్ఞప్తులు ప్రభావం చూపినట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణ ఆస్తుల విలువ ఏప్రిల్ చివరిలో రూ.1,78,110 కోట్లుగా ఉండగా, మే చివరికి రూ.1,84,571 కోట్లకు పెరిగింది. ఫ్లెకీ క్యాప్ ఫండ్లలోకి రూ.5,175 కోట్లు, స్మాల్ క్యాప్‌లోకి రూ.4,945 కోట్లు, మిడ్ క్యాప్‌లోకి రూ.4,385 కోట్లు, లార్జ్ క్యాప్ ఫండ్లలోకి రూ.1,593 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. డివిడెండ్ ఈల్డ్ ఫండ్లు, ఈఎల్ఎస్ఎస్ పథకాల నుంచి పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి.

# మైక్రోసాఫ్ట్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ ఎక్స్‌బాక్స్‌లో ఉద్యోగాల కోత



టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగం ఎక్స్‌బాక్స్ రానున్న రోజుల్లో మరిన్ని లేఆఫ్‌లు ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వ్యాపారం లాభదాయకంగా లేదని, పూర్తిస్థాయిలో మార్పులు అవసరమని సీఈఓ ఆశాశర్మ (Asha Sharma) భావిస్తోన్న నేపథ్యంలో అంతర్జాతీయ మీడియాలో ఉద్యోగుల తొలగింపు వార్తలు వచ్చాయి. ఐదేళ్ల కాలంలో కంటెంట్, ప్లాట్‌ఫామ్‌పై 20 బిలియన్ డాలర్లు వెచ్చించగా.. ఆదాయం మాత్రం ఆ స్థాయిలో లేదు. ఈ విషయాన్ని ఉద్యోగులకు పంపిన మెమోలో కంపెనీ వెల్లడించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వచ్చే జూన్ 30తో ముగిసే ఆర్థిక సంవత్సరం తర్వాత తొలగింపులు చేపట్టాలని యోచిస్తోంది. అయితే ఎంతమందిపై వేటు పడుతుందో తెలియాల్సిఉంది. కాగా.. గతేడాది మైక్రోసాఫ్ట్ 9వేల మందికి లేఆఫ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఎక్స్‌బాక్స్‌లో పలువురు ఉద్యోగాలను కోల్పోయారు. కాగా.. ఈ ఏడాది ప్రారంభంలో ఆశాశర్మ ఎక్స్‌బాక్స్‌కు సీఈఓగా నియమితులయ్యారు. మైక్రోసాఫ్ట్ గేమింగ్ ఆదాయ వృద్ధి మందగించడం, గేమింగ్ కంటెంట్ కోసం ప్రపంచ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ వంటి సవాళ్లు ఉన్న సమయంలో ఆమె ఆ బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ప్రస్తుతం ఆమె సంస్థలు భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు.

# ఆంథ్రోపిక్‌తో టీసీఎస్ జట్టు..




ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS) అంతర్జాతీయ దిగ్గజ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్‌తో జట్టు కట్టింది. వ్యాపారాల్లో ఏఐ వినియోగాన్ని వేగవంతం చేయడం, సమర్థమైన ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ఇరు కంపెనీలూ ఓ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులోభాగంగా టీసీఎస్ ఒక ప్రత్యేకమైన వ్యాపార విభాగాన్ని ఏర్పాటుచేస్తుంది. తమ సంస్థలోని ఇంజినీరింగ్, ఫైనాన్స్, లీగల్, మార్కెటింగ్, సేల్స్ విభాగాలకు చెందిన 50 వేల మంది ఉద్యోగులకు ఆంథ్రోపిక్ 'క్లాడ్' టూల్స్‌ను అందించనుంది. ఈ భాగస్వామ్యం ఆర్థిక సేవలు, హెల్త్‌కేర్, ఏవియేషన్, టెలికాం, మెడ్‌టెక్ వంటి కీలక రంగాలకు అవసరమైన కస్టమ్ ఏఐ ఉత్పత్తులను ఈ రెండు సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేసి మార్కెట్‌లోకి తీసుకొస్తాయి. క్లయింట్ సేవలు, వ్యాపార నిర్వహణ పనులను ఆటోమేటిక్‌గా చేసి, ఉత్పాదకతను పెంచేందుకు క్లాడ్ ఏఐని ఉపయోగిస్తారు. భారత్‌తో కలిసి పనిచేసే విషయంలో ఆంథ్రోపిక్ కట్టుబడి ఉందని టీసీఎస్‌తో భాగస్వామ్యం నిరూపిస్తోందని ఆంథ్రోపిక్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ఆరియో అమోడోయ్ పేర్కొన్నారు. కస్టమర్ల ఉత్పాదకతను పెంచేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె.కృతివాసన్ పేర్కొన్నారు.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు నెలకొనడంతో రోజంతా సూచీలు ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా ఐటీ రంగ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 150.63 పాయింట్ల నష్టంతో 73,832.55 వద్ద ముగిసింది. నిఫ్టీ 53.35 పాయింట్ల నష్టంతో 23,161.60 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.75గా ఉంది. సెన్సెక్స్ ఉదయం 73,615.99 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,983.18) నష్టాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం కాసేపు లాభాల్లోకి వెళ్లింది. ఆ సమయంలో 74,394.34 వద్ద గరిష్ఠాన్ని తాకింది. కాసేపటికే మళ్లీ నష్టాల్లోకి జారుకుని 73,832.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్ షేర్లు నష్టపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 92 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4092 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




## మా ఆయనకు కోచ్‌గా ప్రమోషన్ ఇచ్చా: పీవీ సింధు పోస్టు



పీవీ సింధు భర్త వెంకట దత్తసాయి కాసేపు కోచ్‌గా మారారు. వృత్తిరీత్యా ఆయన స్పోర్ట్స్ డేటా సైంటిస్ట్. కానీ, సింధు కోసం కొద్దిసేపు కోచ్‌గా మారి తన భార్యకు మనోధైర్యం కల్పించారు. ఇదే మాటను పీవీ సింధు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో ఆమె రెండో రౌండ్‌లో మరో భారత షట్లర్ ఇషారాణి బారువాపై 22–20, 21–12 తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా తనకు ఎదురైన అనుభవాన్ని సింధు తెలియజేసింది. "నాకు ఉదయం నుంచి ఒంట్లో అంతగా బాగోలేదు. నొప్పితో బాధపడుతున్నా. ఆ సమయంలో భావోద్వేగమైన మద్దతు అవసరం అనిపించింది. నాకు తెలిసిన వారిలో అత్యంత గొప్ప ఎనలిస్ట్‌ను పిలిచాను. మా ఇద్దరికి ఒకరే కోచ్. నేను కోచ్‌ను పిలిచి ఇషాను ఇబ్బందిపెట్టాలని అనుకోలేదు. దీంతో నా భర్త దత్తసాయికి ప్రమోషన్ ఇచ్చి.. ఆయనను కోచ్‌గా పరిచయం చేశా. నిజం చెప్పాలంటే.. నాకు వద్దు బాబోయ్ అనేంతగా బాగా ప్రోత్సహించారు (నవ్వుతున్న ఎమోజీలు).

# ఆసీస్ జట్టులోకి నిఖిల్ చౌధరీ..



బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్ కోసం ఆస్ట్రేలియా తన స్క్వాడ్‌ను ప్రకటించింది. ఇందులో కొత్తేం ఉందంటారా? ఓ అన్‌క్యాప్డ్ ప్లేయర్‌కు ఆసీస్ మేనేజ్‌మెంట్ అవకాశం కల్పించడం గమనార్హం. 30 ఏళ్ల నిఖిల్ చౌధరీని ఆసీస్ ఎంపిక చేసింది. ట్రావిస్ హెడ్ వ్యక్తిగత కారణాలతో సెలవు తీసుకున్నాడు. అతడి స్థానంలో నిక్కీకి క్రికెట్ ఆస్ట్రేలియా అవకాశం ఇచ్చింది. బంగ్లాదేశ్‌తో ఆసీస్ మూడు టీ20ల సిరీస్‌ను ఆడనుంది. నిఖిల్ చౌధరీ 1996లో భారత్‌లోనే పుట్టాడు. ఇక్కడి దేశవాళీలోనూ ఆడాడు. పదేళ్ల కిందటే అతడి కుటుంబం ఆస్ట్రేలియాలో స్థిరపడింది. ఈ క్రమంలో నిక్కీ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. 1964 తర్వాత భారత్‌లో జన్మించి.. ఆస్ట్రేలియా జట్టుకు ఎంపికైన తొలి క్రికెటర్‌గా అవతరించాడు. గత బిగ్‌బాష్ లీగ్‌లో హోబర్ట్ హరికేన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. స్పిన్ ఆల్‌రౌండర్ అయిన నిక్కీ.. గత ఐపీఎల్‌లోనూ దిల్లీ క్యాపిటల్స్ జట్టులో సభ్యుడు. నిఖిల్ చౌధరీ పంజాబ్ తరపున దేశవాళీ క్రికెట్ కూడా ఆడాడు. ప్రస్తుత భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, డ్యాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మతో డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకొన్నాడు. హర్భజన్ సింగ్ మార్గదర్శకంలోనూ ట్రైనింగ్ అయ్యాడు. దిల్లీలో పుట్టినప్పటికీ.. అతడు దేశవాళీ క్రికెట్‌లో పంజాబ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అటు బ్యాటర్‌గా.. ఇటు స్పిన్నర్‌గా నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించాడు. ఇక బిగ్‌బాష్ లీగ్‌లో 32 మ్యాచులు ఆడిన అతడు 693 పరుగులు చేశాడు. తొమ్మిది వికెట్లు పడగొట్టాడు.

# చెలరేగిన భారత బ్యాటర్లు..



ముక్కోణపు సిరీస్‌లో భారత్ A బ్యాటర్లు అదరగొట్టేస్తున్నారు. తాజాగా అఫ్గాన్ Aతో జరుగుతున్న మ్యాచ్‌లో భారీ లక్ష్యం నిర్దేశించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా 49 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. మధ్యలో వర్షం కారణంగా ఆటను ఒక్క ఓవర్ కుదించడం జరిగింది. ప్రభ్ సిమ్రన్ సింగ్ (84), రుతురాజ్ గైక్వాడ్ (66), తిలక్ వర్మ (66) హాఫ్ సెంచరీలు సాధించారు. అఫ్గాన్ బౌలర్లలో అబ్దుల్లా 5, సాఫి 3, ఇమ్రాన్ ఒక వికెట్ తీశారు. శ్రీలంకపై త్వరగానే పెవిలియన్‌కు చేరిన వైభవ్ సూర్యవంశీ ఈసారి మాత్రం వెనుకడుగు వేయలేదు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడటం మొదలు పెట్టాడు. అయితే, సిక్స్‌లు లేకుండా కేవలం ఫోర్లతోనే ఇన్నింగ్స్‌ను ఆడటం గమనార్హం. 22 బంతుల్లోనే 44 పరుగులు సాధించాడు. మరోవైపు ప్రభ్ నిలకడగా ఆడుతూనే అప్పుడప్పుడు దూకుడు ప్రదర్శించాడు. ప్రియాంశ్ ఆర్య (8) త్వరగానే పెవిలియన్‌కు చేరాడు. కానీ, రుతురాజ్ – తిలక్ వర్మ మాత్రం చెలరేగిపోయారు. నిలకడగా ఆడుతూనే పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో అర్ధశతకాలు నమోదు చేశారు. ఆఖర్లో సూర్యాంశ్ షెడ్గే (40), అనుకుల్ రాయ్ (16★) వేగంగా ఆడారు. కానీ, స్వల్ప వ్యవధిలో వికెట్లను కోల్పోవడంతో భారత్ 350+ మార్క్‌ను అందుకోలేకపోయింది.

# ఒక్క పాయింట్ తగ్గింది.. అయినా, భారత్‌దే టాప్ ర్యాంక్



వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్‌దే అగ్రస్థానం. తాజాగా ఐసీసీ వార్షిక ర్యాంకులను విడుదల చేసింది. అయితే, గతంతో పోలిస్తే ఒక్క పాయింట్ కోల్పోయిన టీమ్ఇండియా.. టాప్ ర్యాంక్‌ను మాత్రం వదల్లేదు. ప్రస్తుతం భారత్ ఖాతాలో 118 పాయింట్లు ఉన్నాయి. ఇక న్యూజిలాండ్ (113), ఆస్ట్రేలియా (103) తర్వాత స్థానాల్లో నిలిచాయి. గత వరల్డ్ కప్ విజేత అయిన ఆసీస్ ఆరు పాయింట్లను కోల్పోవడం గమనార్హం. టాప్–10లో కేవలం దక్షిణాఫ్రికా (102), పాకిస్థాన్ (98) ప్లేస్‌లు మాత్రమే మారాయి. రెండు పాయింట్లను సాధించిన సఫారీ జట్టు నాలుగో ప్లేస్‌కు చేరుకుంది. రెండు పాయింట్లను చేజార్చుకొని పాక్ ఐదో స్థానానికి పడిపోయింది. వచ్చే వన్డే ప్రపంచ కప్ నాటికి టాప్–8 టీమ్‌లకు నేరుగా అర్హత లభించనుంది. పురుషుల టీ20 ర్యాంకుల్లోనూ భారత్‌దే హవా. అందరికంటే ఎక్కువగా 275 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీసుల్లో నిలకడ ప్రదర్శిస్తే చాలు. ఎందుకంటే టీమ్ఇండియా వెనక ఇంగ్లాండ్ (262), ఆస్ట్రేలియా (258) ఉన్నాయి. బంగ్లాదేశ్‌తో ఆసీస్ మూడు టీ20ల సిరీస్‌ను ఆడనుంది. ఇందులో క్లీన్‌స్వీప్ చేస్తే రెండో ర్యాంకుకు చేరే అవకాశం ఆసీస్‌కు ఉంటుంది. ఇక టెస్టుల్లో మాత్రం భారత్ (104) మూడో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా (131), దక్షిణాఫ్రికా (119) టాప్–2లో కొనసాగుతున్నాయి.

# వైభవ్ సూర్యవంశీ హాఫ్ సెంచరీ మిస్

ముక్కోణపు సిరీస్‌లో భారత్ A తరపున బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ రెండో మ్యాచ్‌లో మెరుగ్గా ఆడాడు. తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై త్వరగా పెవిలియన్‌కు



చేరిన అతడు.. అఫ్గానిస్థాన్‌పై కాస్త దూకుడుగానే ఆడాడు. అయితే, హాఫ్ సెంచరీకి ఆరు పరుగుల దూరంలో పెవిలియన్‌కు చేరాడు. కేవలం 22 బంతుల్లోనే 44 పరుగులు చేసిన వైభవ్ అఫ్గాన్ A జట్టు బౌలర్ రహిమి బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఐపీఎల్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ. అలాంటి దూకుడైన ఆటగాడి నుంచి ఇప్పుడు అఫ్గాన్‌పై ఒక్క సిక్స్ రాకపోవడం గమనార్హం. తన 44 పరుగుల్లో 36 రన్స్ (9 ఫోర్లు) కేవలం ఫోర్ల రూపంలోనే వచ్చాయి. పరిస్థితులకు తగ్గట్టుగానే ఆడగలనని చాటిచెప్పాడు. కేవలం సిక్స్‌లు మాత్రమే కాదు.. ఫోర్లతోనూ స్కోరు బోర్డును నడిపించగలనని తన ఆటతో నిరూపించాడు. మరికొద్ది రోజుల్లో జాతీయ జట్టుకు ఆడనున్న క్రమంలో పరిణితి ప్రదర్శించడం అభిమానులను ఆకట్టుకుంది.

